ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 26.0



ఇబ్రహీంపేట ఇసుక స్టాక్‌పాయింట్‌లో మంగళవారం రాత్రి విచారణ జరుపుతున్న టాస్క్‌ఫోర్సు సిబ్బంది

ఇసుక అక్రమ రవాణాపై విచారణ వేగవంతం

కుక్కునూరు, జూలై 24 : కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట ఇసుక స్టాక్ పాయింట్ నుంచి ఇసుక పరిమితికి మించి రవాణా జరుగుతున్న క్రమంలో మంగళవారం టాస్క్‌ఫోర్సు సిబ్బంది దాడులు చేసి మూడు లారీలను పట్టుకుని సీజ్ చేసిన విషయం విదితమే. దీనిపై విచారణ వేగవంతం అయ్యింది. ఈ క్రమంలోనే బాధ్యులైన రెవెన్యూ, పంచాయతీ, మైనింగ్ శాఖలకు సంబంధించి అధికారులకు, కిందస్థాయి సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్టు సమాచారం. కాగా స్టాక్ పాయింటు వద్ద ట్రాస్క్‌ఫోర్సు సిబ్బంది డీపీవో తూతిగ శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత విచారణ జరిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు రికార్డులు స్వాధీనం చేసుకుని సీసీ పుటేజ్‌ను తీసుకున్నారు. ఇసుక స్టాక్ పాయింట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని పిలిపించి ఇసుక అమ్మకాలకు సంబంధించిన జారీ చేసిన బిల్లులను పరిశీలించారు. సాయంత్రం ఆరుగంటల తర్వాత ఇసుక లోడింగ్ జరిగిన విధానంపై సిబ్బంది నుంచి వివరాలు అడిగారు. ప్రాథమిక స్థాయిలో పంచనామా జరిపారు. వీఆర్వో, వీఆర్ఏలు, పంచాయతీ సిబ్బంది ఇచ్చిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఓచర్‌లో ఉన్న అడ్రస్సుకి ఇసుక రవాణా జరిగిందా.. లేదా.. అనే కోణంలో కూడా టాస్క్‌ఫోర్సు సిబ్బంది విచారణ జరిపినట్టు సమాచారం. అయితే ఓచర్‌లో పేర్కొన్న అడ్రస్‌కి ఇసుక రానట్లు గుర్తించినట్టు సమాచారం. స్టాక్ పాయింట్ వద్ద వేయింగ్ బ్రిడ్జి ఏర్పాటు చేయకపోవడంతో ఇసుక అక్రమ రవాణాకు దోహద పడినట్టయింది. దీనిపై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నట్టు సమాచారం.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు : ఎస్పీ

ఏలూరు క్రైం, జూలై 24 : జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ శివకిషోర్ హెచ్చరించారు. జిల్లాలో ఆకస్మి కంగా దాడులు చేయించి ఈనెల 23వ తేదీన ఐదు లారీలు, నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీములను ఏర్పాటు చేశామని, నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామన్నారు. లక్కవరం పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేసి 40 టన్నుల ఇసుక స్వాధీనం చేసుకుని నాలుగు ట్రాక్టర్‌లు, కుక్కునూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు లారీలు, ఒక జేసీబీ స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసి 60 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇసుక అక్రమ రవాణా సమాచారం తెలిస్తే డయల్ 112 కాని పోలీస్ కంట్రోల్ రూమ్ మొబైల్ నంబర్ 83329 59175, వాట్సాప్ నంబర్ 95503 51100కు మెస్సేజ్ రూపంలో సమాచారం అందించాలన్నారు.

ఇళ్లిస్తామంటూ.. బొక్కేశారు!



ఏలూరు అర్బన్ మండలం లక్ష్మీపురంలో ముళ్లపొదల నడుమ జగనన్న ఇళ్ల పునాదులు

గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరించింది. ఎక్కడికక్కడ అందిన కాడికి స్థానిక నేతలే కాదు సాక్షాత్తు నియోజకవర్గ ప్రతినిధులు సైతం సొమ్ములు నొక్కేశారు. నిబంధనలు కాలరాశారు. అధికారులను ఒత్తిడి చేశారు. ఆ కోవలోకే జగనన్న కాలనీలు, ఇళ్ల నిర్మించడంలో ఉన్నది లేనట్లు లెక్కలు చూపారు. కొన్నిచోట్ల మెరక పనులకు పోలవరం కాల్వ మట్టిని వాడి బిల్లులు లాగేశారు. ఇంకొన్ని చోట్ల పాత ఇళ్లనే కొత్త ఇళ్లుగా చూపించి సొమ్ములు లాగించేశారు. ఇలాంటి అక్రమాలు ఎన్నో ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. వీటిపై విచారణ చేయాల్సిందేనని కూటమి ఎమ్మెల్యేలు గట్టిగా పట్టుబడుతున్నారు.

\- ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

అర్హులైన పేదలు అందరికీ పక్కా ఇళ్ల స్థలాలు అంటూ తామొక్కరమే ప్రజాసంక్షేమాన్ని పట్టించుకున్నట్టు పోజులిచ్చారు. ఎక్కడికక్కడ నిబంధనలను పక్కన పెట్టారు. నోరెత్తి ప్రశ్నించకుండా అధికారులను కట్టడి చేశారు. ఒక్క ఏలూరు జిల్లా పరిధిలోనే జగనన్న కాలనీల్లో అనేక అక్రమాలు, తప్పుడు బిల్లులు కొదువే లేకుండా పోయింది. ఇదే జిల్లాకు చెందిన నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కూటమి ప్రభుత్వంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యేలు ఒక్కొక్కరిగా తమ నియోజకవర్గాల్లో చోటుచేసుకున్న జగనన్న కాలనీల వెనుక దారుణాలను మంత్రికి ఏకరువు పెడుతూ వస్తున్నారు. వాస్తవానికి జగనన్న కాలనీల్లో అర్హులైన పేదలందరికీ ఇంటిస్థలాలు ఆపై దఫదఫాల వారీగా పక్కాఇళ్ల నిర్మాణం అంటూ అప్పట్లో విస్తృత ప్రచారం చేశారు. ఎన్నడూలేని విధంగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు పార్టీబేధం లేకుండా ఇంటిస్థలాలు ఇస్తున్నట్టు వలంటీర్ల ద్వారా ప్రచారం చేశారు. ఎమ్మెల్యేల పాత్ర లబ్ధిదారుల ఎంపికలో కొంతే ఉండగా, అత్యధిక భాగాన్ని వలంటీర్లే పోషించారు. వలంటీర్ అనుకూలురుకు ఇంటి స్థల పట్టాలు అలవోకగా దక్కాయి. దీనికితోడు అప్పట్లో ఎమ్మెల్యేలుగా ఉన్నవారు ఇదిగో తమ లిస్ట్ అంటూ జాబితాలు తయారుచేసి మొత్తం పద్దులో తమ ఇష్టులపేర్లు ఉండేలా జాగ్రత్తలు పడ్డారు. దీంతో ఇంటిస్థలాల పంపిణీలో అంతా పారదర్శకంగానే ఉందని ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లబ్ధిదారులైన వేలాదిమందికి స్థలాలు ఇచ్చేశారు. ఇక్కడవరకు బాగానే ఉంది. కాని దీనివెనుకే జగనన్న కాలనీలకు అవసరమైన స్థలసేకరణలో ఇష్టానుసారంగా వ్యవహరించారు. మూడో కంటికి తెలియకుండా ఎకరాలకు ఎకరాలకు ధరలు పెంచిమరీ ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారు. ఎమ్మెల్యే చెప్పిన దానికే అధికారులు సై అంటూ సిఫార్సులు చేశారు. పట్టుమని 10,12 లక్షలు లేని ఎకరా భూమి జగనన్న కాలనీల అవసరానికి వచ్చేసరికి 25 నుంచి 30 లక్షల ధర పలికింది. అసలు ధరను రైతులకు ఇచ్చి మిగతా సొమ్మును వాటాలుగా పంచుకున్నారు. ఆధారాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

హౌసింగ్ ఎస్ఈ సరెండర్?

కొన్నాళ్ల పాటు జిల్లా హౌసింగ్ ఎస్ఈగా వ్యవహరించిన రవికుమార్‌ను తాజాగా పక్కన పెట్టారు. ఇంతకు ముందు ఆయన జడ్పీ సీఈవోగా కూడా వ్యవహరించారు. అప్పటి కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, రవికుమార్‌ను హౌసింగ్ ఎస్ఈగా నియమించారు. కాని ఆయన తీరుపైన కొందరు మంత్రి పార్థసారథికి కొద్దిరోజుల క్రితం ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనను పక్కనపెట్టి జంగారెడ్డిగూడెం హౌసింగ్ ఈఈ శ్రీనివాస్‌ను ఇన్‌చార్జ్ ఎస్ఈగా ప్రస్తుతానికి నియమించారు.

జిల్లాలో హౌసింగ్ ఘోరాలెన్నో..

- జగనన్న కాలనీల్లో అక్రమాలపై అంతర్గత విచారణ
- మెరక పనుల్లోనే భారీగా చేతివాటం
- పాత ఇళ్లనే కొత్త ఇళ్లుగా చూపించి బిల్లులు
- భూసేకరణలోనూ వైసీపీ నేతలు చెప్పిందే వేదం
- ఇక్కడ కమీషన్లు కొట్టేశారంటూ ఆరోపణలు.. మంత్రి కొలుసుకు ఎమ్మెల్యేల ఫిర్యాదు
- హౌసింగ్ ఎస్ఈ రవికుమార్‌కు స్థానచలనం
- జంగారెడ్డిగూడెం ఈఈ శ్రీనివాస్‌కు బాధ్యతలు

ఎవరి ఇష్టారాజ్యం వారిదే

జగనన్న కాలనీల భూసేకరణలో అప్పటి స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ప్రతినిధులు ఏకపక్షంగా వ్యవహరించారు. అంతా తామై ముందుండి కథ నడిపారు. దీనిలో భాగంగానే కొందరు ప్రశ్నించే ధైర్యంచేసినా అప్పట్లో ఆలాంటి వారికి బెదిరింపులు తప్పలేదు. ఏలూరు నగరంలోని పేదలకు లక్ష్మీపురం వద్ద ఇళ్ల కాలనీ చూపించారు. వలంటీర్లే లబ్ధిదారులను వెంటపెట్టుకెళ్లి ఇదిగో ఈ స్థలం మీకు వచ్చింది.. ఇష్టమా కష్టమా అంటూ అక్కడే నిలదీశారు. కాని నగరానికి లక్ష్మీపురం స్థలాలు దాదాపు 13 కిలోమీటర్లు పైబడే. పేద వర్గాలు అందున రోజువారీ పనిచేసుకునే కుటుంబాలు ఏలూరు వచ్చి వెళ్లాలంటే భారమే. కాని ఇవేమి పట్టించుకోకుండా శనివారపుపేటలో ఉన్న పేదలకు నేరుగా లక్ష్మీపురంలో స్థలాలు ఇచ్చారు. దీనిపై స్థానికులు కొన్నాళ్లపాటు కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. అప్పట్లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న ఆళ్లనాని ఈ వ్యవహారాన్ని పరిష్కరిస్తామంటూ పదేపదే చెప్పడంతో కొందరు ఒత్తిడి మేరకు ఆందోళన విరమించుకున్నారు. కాని లక్ష్మీపురం వద్ద జగనన్న లేఅవుట్ యథావిధిగానే కొనసాగింది. ఈ లేఅవుట్‌లో కొందరికి మాత్రమే ఇళ్ల నిర్మాణం చేయగా, వందలాది స్థలాల్లో బేస్‌మెంట్ లేనివి, కొన్ని బేస్‌మెంట్‌లతో మరికొన్ని ఇప్పటికి దర్శనమిస్తున్నాయి. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ జగనన్న కాలనీల నిర్మాణంలో ఇష్టానురీతిన వ్యవహరించారు. తమకు ఎక్కడైతే అనువుగా ఉందో సొంత లబ్ధి పొందాలనుకుంటున్నారో అక్కడే స్థలాలను కొని పేదలకు సెంటు భూమి చొప్పున అప్పగించేశారు. ఇలాంటి తరుణంలోనే చాలాచోట్ల పక్కాఇళ్ళ నిర్మాణానికి వీలుగా వైసీపీ అనుకూలురు కొందరు కాంట్రాక్టర్లుగా ముందుకు వచ్చారు. రాయలసీమకు చెందిన ఒక ముఖ్యనేత, అనుకూలురు ఏలూరు జిల్లా పరిధిలో ఇళ్ల నిర్మాణంలో తమవంతు పాత్ర పోషించేందుకు వెనుకాడలేదు. తొలుత ఇదంతా కాలనీల్లో నిర్మాణాలు వేగంగా పుంజుకోవాలని అందరు అనుకున్నారు. కాని వీటి వెనుక కొన్నిచోట్ల కథలు నడిచాయి. కైకలూరులో నిర్మించిన జగనన్న కాలనీ రాష్ట్రంలోనే ఆదర్శకాలనీగా అప్పట్లోనే ప్రకటించారు. ఎందుకంటే ఇక్కడ కాలనీ నిర్మాణం బాధ్యతలను వైసీపీ ముఖ్యులే దగ్గరుండి చూశారు. ప్రభుత్వం నుంచి వచ్చే రుణం, సబ్సిడీతో పాటు లబ్దిదారులు సొంతగా సమకూర్చే మరికొంత సొమ్మును రాబట్టుకుని మరీ ఇళ్ల నిర్మాణం జరిగేలా చూశారు. కాని ఇంకోవైపు కాలనీల నిర్మాణంలో మెరకపోయడానికి మాత్రం స్థానిక నేతలే లక్షల్లో వాటాలు పంచుకున్నారు.

మంత్రిగారూ.. తేల్చండి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీల్లో చోటుచేసుకున్న అనేక అవకతవకల పై స్థానిక ఎమ్మెల్యేలు గళం విప్పుతున్నారు. తమ నియోజకవర్గాల్లో పరిధిలో ఎక్కడెక్కడ ఎలాంటి అవకతవకలు జరిగాయనే విషయంలో సమగ్ర సమాచారాన్ని రాబట్టి ఆ మేరకు జిల్లాలో ఏకైక మంత్రి, గృహ నిర్మాణ బాధ్యతలు నిర్వర్తిస్తున్న కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మధ్యనే ఏలూరు జిల్లా కేంద్రంలో మంత్రి ఆరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో ముఖాముఖి భేటీ అయ్యారు. నియోజకవర్గాల్లో గడిచిన కొన్నాళ్ళుగా సాగిన వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు. ఇదే సందర్భంలో గృహ నిర్మాణశాఖకు బాధ్యత వహిస్తున్నారు కాబట్టి... జగనన్న కాలనీల్లో జరగరాని అక్రమాలు ఎన్నో జరిగాయి. కోట్లాదిరూపాయల సొమ్ము చేతులు మారింది. పాత ఇళ్ళను కూడా కొత్త ఇళ్ళుగా చూపించి మరీ సొమ్ములు నొక్కేశారంటూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. ఏకంగా జగనన్న కాలనీలో మెరకపోసే క్రమంలో పోలవరం కుడికాల్వ గట్టు మట్టిని తవ్వితీసి కొన్నిచోట్ల తమ్మిలేరులో ఉన్న మట్టిని పోసి మరికొన్ని చోట్ల తామే మెరక పోసినట్టుగా బిల్లులు చేసుకున్నారని ఆయన ఆధారాలతో చూపించారు. పాత ఇళ్లను సైతం కొత్త ఇళ్లుగా చూపించి బిల్లులు పొందేందుకు ప్రయత్నించారంటూ ఘాటైన విమర్శలే చేశారు. తన నియోజకవర్గంలో జగనన్న కాలనీల పేరిట సాగిన దోపిడీపై విచారణ జరిపించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఏలూరు నగరంలో జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఆ తర్వాత ప్రజలను మోసం చేశారని ఎమ్మెల్యే బడేటి చంటి మంత్రి దృష్టికి తెచ్చారు. అంతకు ముందు కైకలూరు నియోజకవర్గంలోనూ జగనన్నకాలనీల్లో జరిగిన అవకతవకలపై కూడా సీఐడీ విచారణ చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఒకానొక సందర్భంలో నేరుగా ప్రస్తావించడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే జిల్లాలో జగనన్న కాలనీల్లో సాగిన అవకతవకలపై వీటిని వెనుకేసుకు రావడానికి కారణమైన గృహనిర్మాణ అధికారుల తీరుపైన, అంతర్గత విచారణకు వీలుగా సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.



కుక్కునూరులోని గుండేటివాగు ప్రాంతంలో వరద ముంపు

వీడని వరద

- క్రమేపి తగ్గుతున్న గోదావరి
- ఉపనది ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు
- మళ్లీ 48 అడుగులకు చేరుకునే అవకాశం
- ముంపులోనే వేలేరుపాడు, కుక్కునూరు

కుక్కునూరు/ వేలేరుపాడు/పోలవరం/ బుట్టాయగూడెం, జూలై 24 : భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం నెమ్మదిగా తగ్గుతోంది. బుధవారం ఉదయం 7గంటలకు 47.3 అడుగు లకు చేరుకుంది. దీంతో 2వ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. సాయంత్రానికి నెమ్మదిగా తగ్గి 6గంటలకు 45.2 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం నిలకడగా గోదారి నీటిమట్టం ఉంది. అయితే ప్రాణహిత ఉపనది ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాత్రికి మళ్లీ గోదావరి నీటి మట్టం పెరగనున్నట్టు సమాచారం. 2వ ప్రమాద హెచ్చరిక 48 అడుగులకు నీటిమట్టం మళ్లీ చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికి మండలం ముంపు నుంచి తేరుకోలేదు. పోలవరం కాఫర్ డ్యాం ప్రభావంతో వేలేరుపాడు మండలంలో వరద ముంపు తగ్గడంలేదు. భద్రాచలం వద్ద మరో 10 అడుగులు నీటిమట్టం తగ్గితేకానీ గ్రామాలను చుట్టుముట్టిన వరద తొలగి పోయే అవకాశం లేదు. మండలంలోని 30 గ్రామాలను వరద చుట్టుముట్టింది. మండల కేంద్రమైన వేలేరుపాడు సంత మార్కెట్ సెంటర్‌లోకి వరద ప్రవేశించడంతో సుమారు 10 ఇళ్లు ముంపునకు గురయ్యాయి. మరోవైపు గోదావరి వరద పూర్తిగా తగ్గే వరకు అధికారులంతా ముంపు మండలాల్లోనే ఉండాలన్న కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు అధికారులు వరద చుట్టుముట్టిన గ్రామాల్లో సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలకు ఇప్పటికే బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులను, వాటర్ ప్యాకెట్లను అందిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా పారిశుధ్యం పనులను, వైద్య శిబిరాలను నిర్వహిస్తూ అవసరమైన వారికి మందులు ఇస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో జంగారెడ్డిగూడెం ఆర్డీవో వేలేరుపాడులోనే మకాం వేసి వరద పరిస్థితి ఆరా తీస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందిని నియమించి ఎలాంటి అసౌకర్యం ప్రజలకు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.



వేలేరుపాడులో వరద నీటిలోనే ఇళ్లు

- పోలవరంలో గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గింది. పోలవరంలో గోదావరి నీటిమట్టం 24.267 మీటర్లకు చేరుకుంది. భద్రాచలం వద్ద నీటిమట్టం 45.50 మీటర్లకు చేరుకోవడంతో దిగువకు ప్రవహించి స్పిల్‌వేలోకి వస్తున్న వరద జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న 11,82,837 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్టు ఈఈ మల్లిఖార్జునరావు, డీఈ మాధవరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.480 మీటర్లు, స్పిల్‌వే దిగువన 25.290 మీటర్లు నమోదైనట్టు ఈఈలు పి.వెంకటరమణ, మల్లిఖార్జునరావు తెలిపారు.
- బుట్టాయగూడెం మండలంలోని శ్రీ గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం గేట్లను బుధవారం మూసివేసినట్టు ఏఈ సురేష్ తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కొండవాగుల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గడంతో గేట్లను మూసివేసినట్టు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 214.55 మీటర్లు ఉందని ఇన్‌ఫ్లో 30 క్యూసెక్కులు వస్తోందన్నారు.



వేలేరుపాడు మండలంలో వరద నీటిలోనే మునిగి ఉన్న తాట్కూరుగొమ్ము రోడ్డు

వివరాలు సక్రమంగా ఉండాలి

పంట నష్టాలపై అధికారులకు జేసీ ధాత్రిరెడ్డి ఆదేశం

ఏలూరు రూరల్/దెందులూరు, జూలై 24 : భారీ వర్షాలకు, వరదలకు దెబ్బ తిన్న రైతులను ఆదుకునేందుకు అన్ని శాఖల అధికారులు వివరాలను సక్రమంగా నమోదు చేయాలని జేసీ ధాత్రిరెడ్డి ఆదేశించారు. ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె దెందులూరులో నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో మాట్లాడుతూ వర్షాలు, వరదలకు దెబ్బ తిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఈ మేరకు అధికారులు వివరాలను సమగ్రంగా రూపొందించాలన్నారు. సాయి ట్రేడర్స్ రైస్ మిల్లును తహసీల్దార్ జితేంద్రతో కలిసి పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాల నుంచి తీసుకున్న ప్రభుత్వ ధాన్యాన్ని సక్రమంగా మిల్లింగ్ చేసి నిర్ణీత కాలంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ సివిల్ సప్లైకి ఇచ్చేవిధానం, మిల్లులోని సార్‌టెక్స్ మిషనరీ, బ్లెడింగ్ మిషనరీ, మిల్లు స్టోరేజ్ కెపాసిటీ, గోనెసంచులు స్వయంగా చూసి డీఎస్‌వో మంజుభార్గవి, పౌరసరఫరాల అధికారి ఆర్.ఎస్.ఎస్ సత్యనారాయణరాజు, సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యత అభివృద్ధి, సంక్షేమ పథకాలు జిల్లాలు కొనసాగుతున్న కార్యక్రమాలు కొనసాగించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ఐపీఎస్ నుంచి ఐఏఎస్‌కు..

పాడేరు సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ధాత్రిరెడ్డి జిల్లాకు జేసీగా బదిలీపై వచ్చారు. తెలంగాణలోని యాద్రాద్రి, భువనగిరి జిల్లా చౌటప్పల్ మండలం గుండ్లబావికి చెందిన ఆమె 2018లో ఐపీఎస్‌కు ఎంపిక అయ్యారు. శిక్షణ సమయంలో మళ్లీ సివిల్స్ రాసి 2019లో జాతీయ స్థాయిలో 46వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. కలెక్టరేట్‌కు విచ్చేసిన ఆమెకు ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి ఎం.ముక్కంటి, ఏలూరు, నూజివీడు ఆర్డీవోలు ఎస్.ఎస్.కె. ఖాజావలి, వై.భవానిశంకరి, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. జడ్పీ సీఈవో కె.సుబ్బారావు, ఏలూరు తహసీల్దార్ మురార్జీ అభినందనలు తెలిపారు. కలెక్టర్ కె.వెట్రిసెల్విని జేసీ మర్యాద పూర్వకంగా కలిశారు.



బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

వైద్య వృత్తికి వన్నె తేవాలి : కలెక్టర్

సమాజంలో వైద్య వృత్తికి ఉన్న గౌరవానికి మరింత వన్నెతెచ్చేలా ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. జిల్లాలో పారిశుధ్యం, వైద్య సేవలు, విద్య తదితర అంశాలపై మండలస్థాయి అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నిర్దేశించిన సమయం వరకు ఉండాలన్నారు. నూరు శాతం పిల్లలకు వ్యాక్సినేషన్ పూర్తిచేయాలని, వెనుకబడిన బంగినపల్లితోట, రమణక్కపేట, ధర్మాజీగూడెం వైద్యాధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలస్థాయి మెరుగు పరచాలన్నారు. ఆ దిశగా కృషి చేసే ఎంఈవోలకు ర్యాంకింగ్‌లు కేటాయించి అభినందిస్తామ న్నారు. డీఎంహెచ్‌వో శర్మిష్ట, డీఈవో అబ్రహం, డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. రొయ్యో!

- వైరస్‌తో మృత్యువాత
- హడావిడిగా పట్టుబడులు
- 200 కౌంట్ రొయ్య రూ.130

ముదినేపల్లి, జూలై 24 : భారీ వర్షాల కారణంగా వాతావరణంలో అత్యధిక చల్లదనం ఏర్పడడంతో రొయ్యలకు వైరస్ సోకింది. చెరువుల్లో ఆక్సిజన్ శాతం లోపించడంతో రొయ్యలు వైరస్ బారిన పడి చనిపోయాయి. వర్షాలకు వివిధ రకాల తెగుళ్లు వ్యాపిస్తుండడంతో రైతులు రొయ్యల పట్టుబడులను హడావిడిగా నిర్వహిస్తున్నారు. ముదినేపల్లి మండలంలో ప్రస్తుతం సుమారు 12 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. సాగులో ఉన్న చెరువుల్లో నాలుగు రోజులుగా సుమారు 3 వేల ఎకరాల్లో రొయ్యలకు వైరస్ వ్యాధి సోకినట్లు సమాచారం. ధరలు లేకున్నా రొయ్యల పట్టుబడులు నిర్వహించి తక్కువ రేటుకే అమ్మేస్తు న్నారు. బుధవారం ఒక్క రోజే మండలంలో 1000 ఎకరాల్లోని చెరువుల్లో రొయ్యల పట్టుబడులు జరిగినట్టు తెలిసింది. వంద కౌంట్ కోసం ఎదురు చూసిన ఆక్వా రైతులు వైరస్‌కు భయపడి 200 కౌంట్ రొయ్యలను పట్టేస్తున్నారు. ఈ కౌంట్ రొయ్యల ధర క్వింటా రూ.13 వేలకే అమ్మేస్తున్నారు. 200 కౌంట్ రొయ్య స్థానిక మార్కెట్‌లోనే అమ్ముడుబోతున్నందున ధర పలకడం లేదు. చెరువులో వేసిన పిల్ల ఖర్చు కూడా చేతికి దక్కడం లేదని ఆక్వా రైతులు వాపోతున్నారు.



పట్టిన రొయ్యలు



పెదగొన్నూరులో రొయ్యల పట్టుబడులు

గిట్టుబాటు కావడం లేదు



వాతావరణంలో తేడా, వర్షాలు కురవడంతో రొయ్యలు వైరస్ బారిన పడ్డాయి. ధర గిట్టుబాటు లేకపోయినా పట్టక తప్పడం లేదు. కనీసం ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు దక్కడం లేదు.

\- జి.వేణు, ఆక్వా రైతు, పెదగొన్నూరు



జగన్ పాలనలో జల యజ్ఞానికి సమాధి

రైతుల కోసం వైఎస్ ప్రారంభించిన జలయజ్ఞం కార్యక్రమానికి జగన్ సమాధి కట్టారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. బుధవారం ఎర్ర కాలువ వరదకు నీటమునిగిన తాడేపల్లిగూడెం మండలం నందమూరు ప్రాంతంలో ఆమె పర్యటించారు. పంట చేల వద్దకు బురదలో నడిచి వెళ్లారు. రైతులు ఆమెకు కుళ్లిన వరినారు చూపించి తమ గోడు వెళ్లబోసుకున్నారు..

-7లో..

జగన్ పాలనలో జలయజ్ఞానికి సమాధి

ఎర్ర కాలువ ముంపు ప్రాంతాల్లో వైఎస్ షర్మిల పరిశీలన



పంట పొలాల పరిశీలనలో భాగంగా చేల బురద గట్టుపై నడిచి వెళుతున్న వైఎస్ షర్మిల

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 24 : జగన్ పాలనలో వైఎస్ మానస పుత్రికగా రైతుల కోసం ప్రారంభించిన జలయజ్ఞం కార్యక్రమాన్ని సమాధి కట్టారని, కనీసం పాత మంచినీటి ప్రాజెక్టులకు మరమ్మ తులు కూడా చేయకపోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఎర్ర కాలువ ముంపు ప్రభావంతో నీటమునిగిన తాడేపల్లి గూడెం మండలం నందమూరు ప్రాంతంలో బుధవారం ఆమె పంట చేల వద్దకు బురదలో నడిచి వెళ్లారు. రైతులు ఆమెకు కుళ్లిన వరినారు చూపించేందుకు చేలో దిగితే ఆమె స్వయంగా నడుంలోతు నీళ్లలో దిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెతో గ్రామంలోని రైతులు ముంగళ్ల రత్తయ్య, గర్సుకూటి సర్వేశ్వరరావు తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఎప్పుడు వర్షాలు వచ్చినా తమ ప్రాంతాన్ని ఎర్ర కాలువ ముంచేస్తుందని గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఎర్రకాలువ గట్లు పటిష్టం చేసినా గట్లకు గండ్లు పడ్డాయని.. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎర్రకాలువ వైపు కన్నెత్తి చూడకపోవడంతోనే గత ఐదేళ్లుగా తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఎకరాకు రూ.12 వేల చొప్పున ఒక్కో రైతుకు లక్ష నుంచి మూడు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుల మాటలకు స్పందిస్తూ ఆమె గత వైసీపీ ప్రభుత్వం పాపాలే నేడు ప్రతిపక్షం కూడా లేకుండా చేశాయన్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వమైనా వచ్చే ఏడాది నాటికి రైతులకు ఈ పరిస్థితి రాకుండా ముంపు బారి నుంచి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కష్టాల్లో ఉన్న రైతులకు నష్టపరిహారం అందించాలని, రైతుల కోసం ప్రభుత్వం ప్రకటించకపోయినా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతంలో రాజకీయాలు చేయడానికి రాలేదని రైతుల పరిస్థితి స్వయంగా చూసి ప్రభుత్వానికి తెలియచెప్పేందుకే చేలలోకి వెళ్లి పరిస్థితి సమీక్షిస్తున్నామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మార్నీడి బాబ్జి, జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్, కామన ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కొత్త స్టడీ సెంటర్స్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 24:ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం, గుంటూరు వారు 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు కొత్త స్టడీ సెంటర్స్ పర్మిషన్‌కు ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, ఎంపీఎల్, ప్రైవేటు హైస్కూల్స్, జూనియర్ కళాశాలలు దరఖాస్తు చేయుటకు వీలుగా apopen-school.ap.gov.in వెబ్‌సైట్ నందు అప్లికేషన్‌ను పొందపరచామని జిల్లా విద్యా శాఖ అధికారి జి.నాగమణి తెలిపారు. ఇప్పటికే పర్మిషన్ పొంది ఉన్న స్టడీ సెంటర్లు కూడా రెన్యువల్స్ చేసుకోవాని సూచిస్తూ దానికి సంబంధించిన అప్లికేషన్‌ను apopenschool.ap.gov.in ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ నందు పొందుపరిచామన్నారు. కొత్త స్టడీ సెంటర్స్ పర్మిషన్, రెన్యువల్స్ దరఖాస్తులను డీఈవో కార్యాలయానికి రెండు ప్రతులు సమర్పించాలని డీఈవో పేర్కొన్నారు.

ఉద్యాన కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 24 : డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీలో రెండేళ్ల డిప్లమో కోర్సు పూర్తిచేసి హార్టీ సెట్-2024 దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 26న ప్రవేశ పరీక్ష ఉంటుందని హాల్‌టికెట్‌లు రాని అభ్యర్థులు తమ ఐడీకార్డులు చూపిస్తే డూప్లికేట్ హాల్ టికెట్‌లు పొంది పరీక్ష రాయవచ్చని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు బుధవారం తెలిపారు. హార్టీకల్చర్ డిప్లమో కోర్సుల ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు తమ దరఖాస్తులు 25, 26 తేదీల్లో అవకాశం కల్పించామన్నారు. ఆ విద్యార్థులు ఈనెల 29, 30, 31 తేదీల్లో తమకు కావాల్సిన కళాశాల ఆప్షన్‌లు నమోదుచేసుకోవచ్చని, ఆగస్టు 3న అభ్యర్థులకు కళాశాలల కేటాయింపు ఉంటుందన్నారు. ఆ అభ్యర్థులు ఆగస్టు 4 నుంచి 7వ తేదీ వరకూ వారికి కేటాయించిన కళాశాలల్లో చేరాల్సి ఉంటుందని వివరించారు. బీఎస్సీ (హానర్స్) హార్టీకల్చర్ నాలుగేళ్ల కోర్సు ప్రవేశానికి ఏపీఈఏపీసెట్-2024 అర్హత పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఆగస్టు 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

సెస్ లేకుండా పొగాకు కొనుగోళ్లకు అనుమతి

కొయ్యలగూడెం/జంగారెడ్డిగూడెం, జూలై 24 : అదనంగా పండించిన పొగాకుకు సెస్ లేకుండా కొనుగోలు చేయడానికి కోర్టు అనుమతి ఇచ్చిందని కొయ్యలగూడెం పొగాకు బోర్డు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రైతులు తమ సమస్యను ఎంపీలు పురందేశ్వరి, మహేష్ యాదవ్‌లను కలిసి విన్నవించడంతో వారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సెస్ లేకుండా పొగాకు అమ్ముకోవడానికి అనుమతి ఇచ్చారన్నారు. ఈమేరకు రైతులకు ఒక్కొక్కరికి రూ.50వేల వరకు లబ్ధి చేకూరనుందన్నారు. ఒక్కో బ్యారన్‌కు రైతు 35 క్వింటాళ్ళ పొగాకు పండించాల్సి ఉండగా 2024-25 సంవత్సరానికి గాను ఒక్కో బ్యారన్‌కు 41 క్వింటాళ్ళ పొగాకును పండించడానికి కేంద్రం అంగీకరించిం దన్నారు.ఈ సందర్భంగా ఎంపీలకు, బోర్డు అధికారులకు రైతు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.



నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ ప్రతినిధులు

'కూటమి ప్రభుత్వంతో నెరవేరనున్న ఆశలు'

తణుకు, జూలై 24 : 'రాష్ట్రంలో మెజారిటీ ఉద్యోగులు కోరుకున్నట్టుగానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఈ ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు నెరవేరతాయని నమ్మకం ఉంది' అని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. బుధవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయంలో ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌వీ రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు విలీనం తర్వాత ఈహెచ్ఎస్ ప్రవేశపెట్టి గతంలో దశాబ్దాలుగా ఆర్టీసీ సంస్థ ద్వారా పొందే రిఫరల్ ఆసుపత్రుల వైద్య సౌకర్యాలను గత ప్రభుత్వ హయాంలో తొలగించినందున.. ఉద్యోగుల ఇబ్బందుల దృష్ట్యా పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేత ఎం.డి.ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండి. ఎ.ఆలీ, విజయవాడ జోన్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్‌రావు, వై.శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.ప్రసాదు, జిల్లా కార్యదర్శిగా అల్లం సత్యనారాయణ, వర్కింగ్ అధ్యక్షుడిగా ఎంఎస్. బాబు, కోశాధికారిగా రవికుమార్‌తో పాటు ఎనిమిది మంది సభ్యులను ఎన్నుకున్నారు.

31లోపు పదోన్నతుల అభ్యంతరాలు తెలపండి

ఏలూరుటూటౌన్, జూలై 24: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు నగర పాలక సంస్థ, ఏడు పురపాలక పాఠశాలల్లో పని చేయుచున్న సెకండ్ గ్రేడ్ టీచర్లకు, తెలుగు, హిందీ లాంగ్వేజ్ పండిట్లకు పదోన్నతి కల్పించడానికి సీనియార్టీ జాబితాను డీఈవో లాగిన్‌లో పొందుపరిచామని డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు. అభ్యంతరాలను ఈనెల 31వ తేదీ లోపు తెలిపాలని ఆయన సూచించారు.



అనధికార సెల్‌ఫోన్లను పోలీసులకు అందిస్తున్న షాపు నిర్వాహకులు

సెల్‌ఫోన్ షాపులపై పోలీసు దాడులు

ఏలూరు క్రైం, జూలై 24 : నగరంలో సెల్‌ఫోన్ల చోరీలు పెరిగిపోతున్నా యని వాటిని వెంటనే నగరంలో ఉన్న కొన్ని సెల్‌ఫోన్ షాపులకు విక్రయిస్తున్నట్టుగా జిల్లా ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్‌కు సమాచారం అందింది. ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ సీహెచ్‌వీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో టూటౌన్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు కలిసి సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తున్న ఏలూరు రామచంద్రరావుపేటలో ఉన్న షాపులపై బుధవారం దాడి చేశారు. ఎటువంటి రసీదులు లేని సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్లను గుర్తించి వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా సెకండ్ హ్యాండ్‌లో సెల్‌ఫోన్‌లు కొనుగోలు చేశారంటే కచ్చితంగా అమ్మినవారి ఆధార్‌కార్డు, ఫోన్ బిల్లు, బాక్సు వంటి వివరాలు ఉండాలని పోలీసులు తెలిపారు. దొంగ సెల్‌ఫోన్లు కొనుగోలు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించండి

▸▸ మంత్రి సంధ్యారాణికి ఉపాధ్యాయుల వినతి

బుట్టాయగూడెం, జూలై 24 : ఏలూరు జిల్లా కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణిని అమరావతిలో కలిసి ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. నైట్ డ్యూటీ, నైట్ హాల్ట్, టర్న్ డ్యూటీల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీచేయాలని, ఐటీడీఏ పరిధిలోని ఉన్న అన్ని పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, ఐటీడీఏకు రెగ్యులర్ డీడీని నియమించాలని, అన్ని ఆశ్రమ పాఠశాలల్లో నర్సులను నియమించాలని వినతిలో కోరారు. ఉపాధ్యాయుల వినతిపై ఆమె సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు ఏపీటీఎఫ్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బి.రెడ్డిదొర, కె.సతీష్, కరకం శ్రీనివాస్, వెట్టి రమణ, ఏటీఏ నాయకులు చిర్రి దేవరాజు, సోదెం రాజు, తెల్లం రాములు, సరియం నాగేశ్వరావు, కె.వెంకటేశ్వరావు, ఎస్.రంగారావు, చోడెం నాగేశ్వరావు పాల్గొన్నారు.



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

క్రైం సమాచారం

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లుగా బెదిరింపు

▸▸ కర్రీ పాయింట్ నిర్వాహకుడి నుంచి సొమ్ములు వసూలు చేసిన నలుగురి అరెస్టు

▸▸ నిందితుల వద్ద మీడియా నకిలీ ఐడీ కార్డులు..

ఏలూరు క్రైం, జూలై 24 :ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల మంటూ ఒక కర్రీ పాయింట్ నిర్వాహకుడిని బెదిరించి సొమ్ములు గుంజిన నలుగురిని ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారని ఏలూరు డీఎస్పీ ఈ. శ్రీనివాసులు బుధవారం రాత్రి తెలిపారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీఈ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఏలూరు రూరల్ మండలం కొత్తూరు ఇందిరమ్మ కాలనీ మెయిన్‌రోడ్డులో మండల అప్పలనాయుడు కర్రీ పాయింటు నిర్వహిస్తున్నాడు. అతడి వద్దకు ఈనెల 22వ తేదీన ఒక మహిళ వచ్చి తాను ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌నని కూరలలో రంగులు, కెమికల్స్ కలుపుతున్నారని ఫిర్యాదు వచ్చిందంటూ, లైసెన్సు ఉందా అంటూ బెదిరించి ఉన్నతాధికారులతో మాట్లాడాలంటూ సెల్‌ఫోన్‌ను అప్పలనాయుడుకు ఇచ్చింది. ఆ ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి అప్పలనాయుడిని బెదిరించాడు. అనంతరం అతడి వద్ద నుంచి రూ.పది వేలు తీసుకున్నారు. బాధితుడికి అనుమానం కలిగి ఈ సంఘటనపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ కె. రాజారెడ్డి వారి సిబ్బంది, హెడ్ కానిస్టేబ్ కె.సత్యారావు, కానిస్టేబుళ్ళు పి.నాగరాజు, చెన్నారావు, జి.అజయ్, మహిళా కానిస్టేబుల్ చైతన్య ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. నేరానికి పాల్పడిన నలుగురు వ్యక్తులను బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా అవతారంతో వచ్చిన ఏలూరు రూరల్ మండలం చాటపర్రు రోడ్డుకు చెందిన ముంగర వెంకటదుర్గ అలియాస్ ఘంటసాల దుర్గ, ఉన్నతాధికారిగా మాట్లాడిన ఏలూరులోని హనుమాన్‌నగర్ సిక్కులగుడి ప్రాంతంలో నివాసం ఉంటున్న బుక్కిరి దేవీప్రసాద్ వీరితో పాటు ఈ నేరానికి పాల్పడిన ఏలూరు మారుతీనగర్‌కు చెందిన అగ్గాల ఉమామ హేశ్వరి, ఏలూరు తంగెళ్ళమూడి ఎమ్మార్సీ కాలనీకి చెందిన పులిగా రాంబాబు పలు న్యూస్ చానళ్ల విలేకరులుగా నకిలీ ఐడీ కార్డులను కలిగియున్నారు. వారిని అరెస్టు చేసి వారి వద్ద ఐడీ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదు దారుడు అప్పలనాయుడిని కొంతమంది బెదిరించి మళ్ళీ వారికి అనుకూలంగా వాయిస్ చెప్పించుకుని గ్రూపుల్లో పెట్టిన వారిపై విచారణ చేపట్టామని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈ.శ్రీనివాసులు చెప్పారు. నిందితులను ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వద్ద అరెస్టు చేశామని వెల్లడించారు. వారి వద్ద నుంచి రెండు మోటారు సైకిళ్ళు, గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎవరైనా మీడియా ముసుగులో కాని, ప్రభుత్వ అధికారులమని ఎవరినైనా బెదిరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ సూచించారు.



నిందితులు వినియోగిస్తున్న నకిలీ ఐడీ కార్డులను చూపుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

బైక్ దొంగతనం కేసులో ఒకరి అరెస్టు



పట్టుబడిన వారితో భీమవరం పోలీసులు

భీమవరం క్రైం, జూలై 24 : మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులో ఒకరిని అదుపులోకి తీసుకున్నామని భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. భీమవరం డీఎస్పీ వి.నారాయణ స్వామిరెడ్డి నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందాన్ని పంపించగా భీమవరం వన్‌టౌన్ యనమదుర్రు మురుగు కాల్వ గట్టు సమీపంలో ఉంటున్న బోను మోజెస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పలు ప్రాంతాలలో బైక్‌లు దొంగతనం చేసినట్టు అంగీకరించారని ఎస్ఐ తెలిపారు. అతడి వద్ద మూడు బైక్‌లు సీజ్ చేసి అతడిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తు చేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ నయీం అస్మి అభినందించారు.

గేదెల కోసం చెరువులో దిగి వృద్ధుడి మృత్యువాత

చింతలపూడి, జూలై 24 : పశువులను మేతకోసం తీసుకువెళ్ళిన వృద్ధుడు కాటూరి వీరయ్య(65) చెరువులో దిగి మృత్యువాత పడిన ఘటన మల్లాయిగూడెంలో బుధవారం జరిగింది. మల్లాయిగూడెంకు చెందిన అతడు రోజువారీగా తన ఇంటి పశువులను మేతకోసం చెరువు సమీపంలోకి తీసుకెళ్లాడు. చెరువులోకి దిగిన పశువులు మరోవైపునకు వెళుతుండగా వాటిని మళ్లించడానికి చెరువులోకి దిగి కొంతదూరం వెళ్లిన తరువాత ప్రమాదవ శాత్తు మునిగిపోయాడని గ్రామస్తులు తెలిపారు. పోలీస్, ఫైర్ అధికారులకు సమాచారం అందించగా చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ కుటుంబరావు పరిశీలించారు.

వివాహితపై అసభ్య ప్రవర్తన.. ఒకరిపై కేసు

టి.నరసాపురం, జూలై 24 : వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ. డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. వివరాలిలా.. వెంకటాపురం గ్రామానికి చెందిన చెలికాని స్వాతి.. బొర్రంపాలెం గ్రామ సెంటర్లో జూలూరి కరుణ షాపును ఒక ఏడాదికి లీజు అగ్రిమెంట్ చేసుకుని సుమారు నాలుగు నెలల నుంచి టీస్టాల్ పెట్టుకుని జీవనం సాగిస్తోంది. టీస్టాల్ ప్రదేశంలో ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో కరుణ వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించడంతో పెద్దల్లో పెట్టి మందలించారు. మళ్లీ రెండోసారి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించి బెదిరించినట్టు ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఉంగుటూరు జూలై 24 : ఉంగుటూరు మండలంలో 24 ఏళ్ల యువతి అదృశ్యమైనట్టు ఆమె తండ్రి కొండేటి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్.ఐ. కె.మణికుమార్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ఆమె ఈనెల 21 తేదీ రాత్రి అదృశ్యమైందని ఈ విషయమై గ్రామానికి చెందిన సుంకర భాను అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగపాలెం, జూలై 24 : లింగపాలెంలో అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఎస్ఐ పి.చెన్నారావు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం మండలంలోని తువ్వచిలుకరాయుడుపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌పై అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నా మని, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

కట్నం వేధింపులపై రెండు కేసుల నమోదు

ఉండి జూలై 24: వరకట్న వేధింపులపై వేర్వేరు చోట్ల రెండు కేసులు నమోదు చేశామని ఉండి ఎస్ఐ లక్ష్మణ్ బుధవారం తెలిపారు. ఉండి గ్రామానికి చెందిన పులి కనకదుర్గను భర్త రాఘవేంద్ర, అత్త, ఆడపడుచులు అధిక కట్నం తీసుకునిరావాలని వేధిస్తున్నారని ఫిర్యాదు చేసిందన్నారు. 2016లో వారికి వివాహమైందని, అప్పుడు తీసుకున్న కట్నం కాకుండా అధిక కట్నం తీసుకుని వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది. అదేవిధంగా మహదేవపట్నంలో తంగెళ్ల సుశీలను భర్త పెద్దిరాజు, అత్తమామలు అధికకట్నం తీసుకుని రావాలని వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు. పదమూడేళ్ల క్రితం వివాహమైందని, ఇప్పుడు అధికకట్నం తీసుకుని రావాలని వేధిస్తున్నారని ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నా కుమారుడిది హత్యే !

తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు.. అనుమానాస్పద మృతిగా కేసు



విలేకరులతో మాట్లాడుతున్న మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు (ఇన్‌సెట్‌లో) అభినవకుమార్

వేలేరుపాడు, జూలై 24:వేలేరుపాడుకు చెందిన సరిపల్లి అభినవకుమార్ (17) అనుమానస్పదంగా మృతి చెందాడు. దీనిపై యువకుడి తండ్రి వెంకటేశ్వరరావు జంగారెడ్డిగూడెంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద విలేకరులతో బుధవారం మాట్లాడుతూ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. తన కుమారుడు ఈనెల 21న స్నేహితులతో కలిసి బయటకు వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆరా తీయగా స్నేహితుడు మేకల మురళీతో కలిసి జంగారెడ్డిగూడెం మండలం చెల్లావారిగూడెం వెళ్ళినట్లు తెలిసిందన్నారు. మురళీతో మాట్లాడగా శనివారం రాత్రి చెల్లావారిగూడెంలో ఉండి తిరిగి ఇంటికి బయల్దేరి వచ్చేక్రమంలో కారులో రాజమండ్రి వెళ్లినట్టు తెలిపాడని ఆదివారం, సోమవారం వరకు తన కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఫోన్లో చేయగా వస్తున్నానంటూ చెప్పాడని తెలిపారు. మంగళవారం తన పక్క ఇంట్లో నివాసం ఉంటున్న పత్రా ముత్యాలు తల్లి తమ వద్దకు వచ్చి మీ కుమారుడు రాజమండ్రి నుంచి వస్తూ అస్వస్థతకు గురికావడంతో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని తెలిపారన్నారు. ఆసుపత్రికి వెళ్ళే సరికి కుమారుడు విగతజీవుడై మార్చురీలో పడి ఉన్నాడని వివరించారు. పత్రా ముత్యాలు కుటుంబంతో తమకు గతం నుంచి విభేదాలున్నాయని ముత్యాలు తనకుమారుడిని తీసుకెళ్ళి హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారని రిపోర్టు వస్తే నిజాలు బయటకు వస్తాయన్నారు. ఈ ఘటనపై వేలేరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. తన కుమారుడి అనుమానాస్పద మృతి వెనుక గల కారణాలను వెలికి తీసి తమకు న్యాయం చేయాలని కోరారు.

యువతిని మోసగించిన యువకుడికి నాలుగేళ్ల జైలు

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, జూలై 24 : ప్రేమించి పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని లైంగికంగా వేధించి, ఆమె వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసినట్టు ఓ యువకుడిపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరు మహిళా కోర్టు కం ఐదో అదనపు జిల్లా జడ్జి.జి రాజేశ్వరి బుధవారం తీర్పు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణం గునుపూడి బ్రిడ్జిపేటకు చెందిన మద్దా ప్రవీణ్‌కుమార్ అలియాస్ నాని అనే యువకుడు భీమవరంలోని ఓ ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమ పేరుతో దగ్గరై ఆమెను పెళ్ళి చేసుకుంటానని పలు మార్లు లైంగికంగా వేధించాడు. అనంతరం ఆమె ప్రియుడి అనుమతితో కువైట్ వెళ్ళింది. పెళ్ళి ఖర్చుల నిమిత్తం కువైట్ నుంచి ప్రవీణ్ ఖాతాకు దఫదఫాలుగా రూ.80 వేలు పంపించింది. కువైట్ నుంచి వచ్చిన ఆమె వద్ద నుంచి డబ్బు తీసుకుని పెళ్ళి చేసుకోకుండా కాలయాపన చేస్తున్నాడు. ఈ మేరకు బాధితురాలు 2019 జూన్‌లో భీమవరం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ పి.చంద్రశేఖర్ కేసు నమోదు చేయగా అప్పటి సీఐ గోవిందరాజు, సీఐ కృష్ణ భగవాన్ విచారణ చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరులోని మహిళా కోర్టులో విచారణ జరిగి ప్రవీణ్‌కుమార్‌పై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు శిక్ష, ఐదు వేల నగదు జరిమానా విధిస్తూ జి.రాజేశ్వరి తీర్పు చెప్పారు.

తల్లిని గాయపరిచిన కుమారుడిపై కేసు

ఉండి జూలై 24: మద్యం తాగేందుకు డబ్బులు అడిగితే ఇవ్వలేదని కోపంతో తలపై కర్రతో కొట్టి గాయపరిచాడని కుమారుడిపై ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ యెషయా తెలిపారు. ఉండి మండలం చిలుకూరు గ్రామానికి చెందిన ఇండిగపల్లి మరియమ్మను తన కుమారుడు కిశోర్ మద్యం తాగడానికి డబ్బులు అడిగాడని ఆమె ఇవ్వకపోవడంతో కర్రతో తల్లి తలపై కొట్టి గాయపరిచడాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

అసెంబ్లీ పాయింట్..

లిక్కరు పాలసీతో జగన్ దోచుకున్నాడు..



వైసీపీ ప్రభుత్వంలో లిక్కరు పాలసీ ద్వారా జగన్ అడ్డగోలుగా వేల కోట్ల రూపాయలు దోచేశాడు. బ్లాక్ మార్కెట్ ద్వారా వైసీపీ నాయకులు లిక్కరు అమ్ముకుని కోట్ల రూపాయలు వెనకేశారు. ఈ లిక్కరు ఆదాయాన్ని చూపించి బ్యాంకులకు తాకట్టు పెట్టడమే కాకుండా ప్రజలు ఆరోగ్యాన్ని పణంగా పెట్టి అన్ని విధాలుగా రాష్ట్రాన్ని నాశనం చేశారు.

- ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్యే, తణుకు

మద్యం ఉసురు జగన్‌కు తగులుతుంది



మద్యం అమ్మకాలపై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన దురాగతాలు ఇప్పటివరకు ఎవరూ చేయలేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వం మద్యంపై ఎంత ఆదాయం సంపాదించిందో అంతే ఆదాయం జగన్ కూడబెట్టుకున్నాడు. నాసిరకం మద్యం తాగి ఎంతో మంది చనిపోయారు.. ఆ కుటుంబాల ఉసురు తప్పనిసరిగా జగన్‌కు తగులుతుంది.

- బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే, తాడేపల్లిగూడెం

జగన్ తీరు.. దున్నపోతుపై వర్షం కురిసినట్టే..



జగన్ చేసిన అరాచకాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబితే దాన్ని కూడా తీసుకోకుండా ప్రభుత్వం ఏర్పడిన 45 రోజులకే రాష్ట్రపతి పాలన అంటూ ధర్నాకు దిగడం దున్నపోతుపై వర్షం పడినట్టు ఉంది. గతంలో 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని ప్రస్తుతం 11 మంది ఎమ్మెల్యేలే ఉన్నారని, మిగిలిన 140 మందిని ఇప్పించమని కోర్టులో కేసు వేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. ప్రతిపక్ష హోదా కావాలంటూ కోర్టులో కేసు వేయడం కుందేలుకు కూడా కొమ్ములు మొలుస్తాయనే అంత మూర్ఖత్వం జగన్‌కు ఉంది. గతంలో అధికారంలో ఉన్న సమయంలో రాజ్యాంగానికి వ్యతిరేకంగా 200కు పైగా కేసులు కోర్టులో వేశారని ఈ కేసు కూడా అదేవిధంగా వీగిపోతుంది.

- డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే, కైకలూరు


దేశప్రగతి.. రాష్ట్రాభివృద్ధి.. బడ్జెట్ లక్ష్యమిదే

భీమవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది. విద్యార్థులకు, యువతకు ప్రయోజనం, ముద్రా లోను రూ.20 లక్షలకు పెంచారు. మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చేలా రూ.3 లక్షల కోట్లు కేటాయించారు. మౌలిక వసతులకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. దీనివల్ల ఎంతో అభివృద్ధి సాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో పెద్దపీట లభించింది. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి పోటీ చేశారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దిశగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. రాష్ట్ర అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని ప్రతీసారి చెబుతూనే ఉంది. ఇందుకు తగ్గట్టుగానే బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అమరావతి రాజధానికి కేంద్ర కట్టుబడింది. ఇచ్చిన హామీని నెరవేర్చింది, రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ప్రకటించింది. యువతలో నైపుణ్య అభివృద్ధి పెంచే దిశగా విద్య, ఉపాధి కోసం అనువుగా పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. ఆక్వా రంగానికి ఊతమిచ్చారు. మేత ధరలు తగ్గనున్నాయి. జిల్లాలో ఆక్వా రంగం విస్తరించేందుకు కేంద్ర బడ్జెట్ దోహదపడనుంది. ఆక్వా పై ఆధారపడిన జిల్లాగా పశ్చిమకు కేంద్ర బడ్జెట్‌లో ప్రోత్సహకాలు ఉపయోగపడనున్నాయి. జిల్లాలో మౌలిక వసతులు పెరగనున్నాయి. దేశప్రగతికి, రాష్ట్ర అభివృద్ధికి దోహద పడిన బడ్జెట్‌ను ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్రం ప్రవేశపెట్టడం హర్షణీయం.



- కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, భీమవరం

జ్ఞాన సరస్వతికి శాకంబరీ అలంకరణ



భీమవరంటౌన్, జూలై 24 : ఆషాఢ మాసం సందర్భంగా బుధవారం గునుపూడి విద్యాగణపతి ఆలయంలో వున్న జ్ఞానసరస్వతీ అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేశారు. గునుపూడి ఆడపడుచుల సౌజన్యంతో ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేసి అనంతరం కూరగాయలతో అలంకారం చేశారు. భక్తులు దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి నీరు విడుదల



చాట్రాయి, జూలై 24: మంకొల్లు పరిధిలో ఉన్న తమ్మిలేరు ప్రాజెక్టు మధ్య తూముకు బుధవారం మండల టీడీపీ నాయకుడు బొట్టు లక్ష్మణరావు, రైతులు పూజలు చేసి ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసి కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు ఆధునికీకరణకు 2018లో టీడీపీ ప్రభుత్వం జపాన్ బ్యాంకు నిధులు రూ.18 కోట్లు మంజూరు చేయగా, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు అరకొర పనులతో కాలక్షేపం చేసిందన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి దీనిపై అధికారులతో మాట్లాడారని, వర్షాలు తగ్గిన తరువాత పనులు పునఃప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



ఆనందరావు(ఫైల్)

యలమంచిలి, జూలై 24: యలమంచిలిలంక గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు గోదావరిలో గల్లంతైన పితాని ఆనందరావు(43) మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. అతడి ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం గోదావరిలో రెండురోజులుగా గాలింపు చర్యలు చేపట్టిన విషయం విదితమే. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నారు. ఆనందరావు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

కుమార్తె కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు

ఉండి జూలై 24: తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండి గ్రామానికి చెందిన గెద్దా నిహారిక మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదని, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆచూకీ కానరాలేదు. ఈ మేరకు బుధవారం తల్లి శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మండవల్లి, జూలై 24:ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండవల్లి రైల్వేస్టేషన్ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. రైల్వే సిబ్బంది అజయ్‌కుమార్ రైల్వేట్రాక్‌పై మంగళవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సుమారు 2.45 గంటల సమయంలో మండవల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది రైల్వేట్రాక్‌పై పడి ఉండడాన్ని గమనించాడు. వెంటనే రైల్వే స్టేషన్ మాస్టర్‌కు, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐలు బి.వెంకటేశ్వర్లు, ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు: పోలవరం డీఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ

పోలవరం, జూలై 24: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఎన్.సురేష్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. పోలవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుక్కునూరు మండలం వింజరం, ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీలు సీజ్ చేయడం జరిగిందన్నారు. గంజాయి, సారా, బెల్టు షాపుల సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. దొంగతనాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోదావరి వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డ్యాములు, రిజర్వాయర్ల వద్ద స్నానాలు, సెల్ఫీలు వద్దన్నారు. సీఐ మదుబాబు, ఎస్ఐ పవన్ కుమార్ ఉన్నారు.


సెక్యూరిటీ గార్డులు అప్రమత్తంగా ఉండాలి : ఏలూరు డీఎస్పీ



సెక్యూరిటీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ

ఏలూరు క్రైం, జూలై 24: ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో మోటారు సైకిళ్ళు అపహరణకు గురవుతున్నాయని అందిన సమాచారంతో డీఎస్పీ ఈ శ్రీనివాసులు, టూటౌన్ సీఐ కె ప్రభాకర్, ఎస్ఐలు సాధిక్, బాషా, ఆసుపత్రి ఆర్ఎంవో ప్రసాద్‌రెడ్డి బుధవారం ఆసుపత్రి ఆవరణ పరిశీలించారు. ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలో గుర్తించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న 52 మంది పురుష, మహిళా సిబ్బందికి ఆయన సూచనలు ఇచ్చారు. ఆసుపత్రికి నిత్యం సుమారు 3 వేల మంది ప్రజలు వస్తారని, వారి వస్తువులు, వాహనాలకు రక్షణ కల్పించాలన్నారు. ఇబ్బందులుంటే ఆసుపత్రిలో ఉన్న ఔట్‌పోస్టు పోలీసులకు తెలియజేయాలని సూచించారు. రాత్రి వేళ అదనపు గస్తీ నిమిత్తం ఆసుపత్రి ఆవరణకు పంపించి బీట్ పుస్తకాలను కూడా నాలుగు వైపులా ఏర్పాటు చేస్తామన్నారు. తల్లి బిడ్డల విభాగం వద్ద సెక్యూరిటీ సిబ్బంది అత్యంత భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్ఎంవో ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కువ రోజులు పార్కింగ్ చేసే వాహనాలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. టూటౌన్ సీఐ కె.ప్రభాకర్, ఎస్ఐలు సాధిక్, బాషా, ఔట్‌పోస్టు హెడ్‌కానిస్టేబుళ్లు పి.కనకాంబరం, జీవరత్నం, క్రైం పార్టీ కానిస్టేబుల్ వెంకట్, సెక్యూరిటీ గార్డుల ఇన్‌చార్జి రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలలకు వాహనాలు ఇవ్వొద్దు : జంగారెడ్డిగూడెం డీఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం, జూలై 24: మైనర్ బాలురకు ద్విచక్ర వాహనాలను ఇవ్వొద్దని, బాలలు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని డీఎస్పీ యు.రవిచంద్ర హెచ్చరించారు. పట్టణంలో బాలురు నడుపుతున్న 30 వాహనాలను బుధవారం స్టేషన్‌కు తరలించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని ఫోన్ నంబర్ల నుంచి కాల్ వస్తే స్పందించ వద్దన్నారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసం ద్వారా నగదు కోల్పోతే 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘాపెట్టామన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. సమావేశంలో సీఐ పి.రాజేష్, ఎస్ఐ జ్యోతిబసు పాల్గొన్నారు.

ఆటో నగర్ సమస్యలపై నిరంతర పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఏలూరు రూరల్, జూలై 24: మల్కాపురంలోని ఆటోనగర్ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు నిర్వహించాలని అసోసియేషన్ అధ్యక్షుడు అరుణతార నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ సమావేశం బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ఎన్నికలు జరిగిన నాటి నుంచి మాజీ అధ్యక్షుడు నాగభూషణం కొత్త కమిటీపై అనేక కోర్టుకేసులు పెట్టించారని విమర్శించారు. పోరాటాలు చేసి సాధించుకున్న ఆటోనగర్ భూముల రిజిస్ట్రేషన్లు జరిగేలా సభ్యులు పోరాడాలన్నారు. విశాఖపట్నం, కొత్త ఆటోనగర్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పటాన్ ఖాజావలీ, కర్రి గణేష్ మాట్లాడుతూ నూతన సభ్యత్వాల నమోదుతో అసోసియేషన్ బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ కమిటీకి పూర్తి సహకారం అందిస్తామన్నారు. గౌరవఅధ్యక్షుడు ఎమ్డీ సులేమాన్, ఉపాధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు, ఎం.సత్యనారాయణ, ఎస్.చోటే, జి.వి సూర్యనారాయణ, ప్రతాప్, ఏ.రాంబాబు, సంజీవరావు, జోగిరాజు, రాజు, షేక్ జుల్ఫీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్వరాలపై ఇంటింటా సర్వే



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

లింగపాలెం, జూలై 24: గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి జ్వరపీడితుల వివరాలు సేకరించాలని డాక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. కె.గోకవరం పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆసన్నగూడెంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో జ్వరపీడితుల వివరాలు సేకరించి వారికి వైద్య సహాయాన్ని అందజేస్తామన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.కె అబ్రార్‌హుస్సేన్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరించాలి : జయరావు



ప్రార్థన చేస్తున్న పీఠాధిపతి జయరావు

ఏలూరు రూరల్, జూలై 24: ప్రజలు క్రీస్తు మార్గంలో నడవాలని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు సూచించారు. శనివారపుపేటలోని నిత్య సహాయ మాత ఆలయ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జయరావు క్రీస్తు జీవిత చరిత్రను వివరించారు. మానవాళికి క్రీస్తుబోధనలు మార్గదర్శకమన్నారు. ప్రతిఒక్కరూ ఆయన బోధనలు అనుసరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ ఉపదేశకులు సాగర్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విచారణ గురువులు ఫాథర్ మైకేల్, స్టీవెన్‌థామస్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

చింతలపూడి, జూలై 24: పోస్టల్ శాఖ సేవలు వినియోగించుకోవాలని తహసీల్దార్ పీవీవీ.గోపాలకృష్ణ అన్నారు. మేడబడిలో పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో డాక్ చౌపల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి తహసీల్దార్ మాట్లాడుతూ పొదుపు పథకాల వల్ల డిపాజిట్‌దారులకు ఆదాయంతో పాటు ఆర్థిక రక్షణ ఉంటుందని, దేశాభివృద్ధికి దోహదపడతాయన్నారు. పోస్టల్ శాఖ అందించే సేవలు, బీమా పథకాలు, బ్యాంకింగ్ సేవలను ఏలూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జి.దుర్గారావు వివరించారు. మేనేజర్ రాజేష్, కేఎస్ బుజ్జిబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షైలాబీ, ఉపాధ్యాయులు అప్పలరాజు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులు మెచ్చే విధంగా 'దేవరకొండ పోలీస్ స్టేషన్'



విలేకరులతో మాట్లాడుతున్న దుర్గారావు

జంగారెడ్డిగూడెం, జూలై 24: దేవరకొండ పోలీస్ స్టేషన్ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే విధంగా నిర్మించామని, త్వరలో సినిమా విడుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ నిర్మాత, సినీ నటుడు ఉక్కుర్తి దుర్గారావు అన్నారు. అంబికా హోటల్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దుర్గారావు మాట్లాడుతూ ప్రముఖ హీరో సుమన్ పోలీస్ అధికారిగా ముఖ్య పాత్ర పోషించిన ఈ సినిమా మాదక ద్రవ్యాలు, మహిళల కిడ్నాప్, రియల్ ఎస్టేట్‌లో జరుగుతున్న మోసాలపై వాస్తవిక పరిస్థితుల ఆధారంగా నిర్మించినట్లు తెలిపారు. ఈ సినిమాలో .తాను కూడా ముఖ్య పాత్ర పోషించనట్లు తెలిపారు. హైదరాబాద్, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో సినిమా చిత్రీకరించామన్నారు. సామాజిక బాధ్యత, వినోదాత్మకంగా రూపొందించిన అందరినీ ఆకట్టుకుంటుందని ఆయన అన్నారు. సినిమా అద్భుతంగా తెరకెక్కించామన్నారు. ప్రేక్షకులు తమ సినిమాను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో అనన్య సినిమా దర్శకుడు ప్రసాద రాజు, పీఆర్వో కేఎస్.శంకరరావు పాల్గొన్నారు.

రహదారులు ధ్వంసం

● అడుగడుగునా గోతులు ● వర్షాలకు మరింత దారుణం ● బురదలో వాహనదారుల తిప్పలు



బుట్టాయగూడెంలో బురద రోడ్డు



పోలవరం రహదారిలో దిగబడిన బస్సు



పోలవరం మండలం ఇటుకలకోట రహదారి



ఉంగుటూరు మండలం బాదంపూడి వద్ద గోతులు



ఉంగుటూరులో ధ్వంసమైన రోడ్డు

బుట్టాయగూడెం, జూలై 24: బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రస్తుత వర్షాలకు పూర్తిగా ధ్వంసమైన రహదారిపై పెద్దపెద్ద గోతులతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జంగారెడ్డిగూడెం వెళ్లడానికి పట్టెన్నపాలెం నుంచి మరోమార్గం ఉన్నా వరదల కారణంగా జల్లేరు వాగు పొంగడంతో మార్గం లేదు. గోతులమయమైన రోడ్డుపై నిత్యం ప్రమాదాలబారిన పడుతున్నారు. గోతుల్లో ప్రయాణాలు చేయలేక కొందరు పెద్దలు గుంతల్లో మట్టిని పోశారు. వర్షాలకు మట్టి బురదగా మారి ప్రయాణికులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు.

పోలవరం - దొండపూరి రహదారి ప్రమాదకరం

పోలవరం: గుంజవరం దొండపూడి రహదారి భారీ గోతులతో ప్రమాదకరంగా మారింది. వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటుకలకోట పట్టిసీమ డెలివరీ ఛానల్ సమీపంలో భారీ గోతుల్లో ఆర్టీసీ బస్సు దిగబడింది. పోలవరం నుంచి రేపల్లెవాడ జంక్షన్ వరకూ తొమ్మిది కిలోమీటర్ల మేర రోడ్లు కొండవాగుల ధాటికి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి. తానాలకుంట జంక్షన్‌లో కల్వర్టు ఐదేళ్ల క్రితం కొండవాగుల దాటికి సగానికి పైగా కొట్టుకుపోగా తాత్కాలికంగా రాళ్లు వేసి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలకు రాళ్లు కిందికి జారి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి రోడ్లు కల్వర్టులు పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. పోలవరం బస్ కాంప్లెక్స్ భారీ గోతులతో రాకపోకలకు అనువుగా లేకపోవడంతో బస్సులు బస్టాండులోకి వెళ్లకుండా బయట నుంచి వెనుదిరుగుతున్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్ కాంప్లెక్స్ ఆవరణలో గోతులు పూడ్చి బస్ కాంప్లెక్స్‌లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



భారీ గోతులతో బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం రహదారి

వైసీపీ పాలనలో ఐదేళ్ల నిర్లక్ష్యానికి అస్తవ్యస్తమైన రహదారులు ఇటీవల వర్షాలకు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఏజెన్సీ గ్రామాల్లో నడవడానికి కూడా వీలు లేకుండా రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి. భారీ గోతుల్లో నీరు నిలిచిపోయి ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గ్రామీణ రహదారులు బురదమయం కావడంతో జారిపడుతున్నారు.

అధ్వాన రహదారులు

ఉంగుటూరు: మండలంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గోతులు, గొప్పులతో ఉన్న అస్తవ్యస్తమైన రహదారులు వర్షాలకు మరింత దెబ్బతిన్నాయి. ప్రధానంగా బాదంపూడి-తాడేపల్లిగూడెం రహదారిలో ప్రమాదకర పరిస్థితుల్లోనే వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు సైతం అవస్థలు పడుతున్నారు. బాదంపూడి శివారులో పాత పెట్రోలు బంకు వద్ద గోతులు పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదంలో గాయపడుతున్నారు. కైకరం-రామన్నగూడెం రహదారి కూడా వర్షాలకు పాడై అధ్వానంగా తయారైంది. మండలంలో పలు గ్రామీణ రహదారులు నడవడానికి కూడా అనువుగా లేవని ప్రజలు వాపోతున్నారు.



ఏలూరులో విలేకరులతో మాట్లాడుతున్న కూటమి నేతలు



జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పోలవరం, అమరావతికి కేంద్ర సహకారం శుభపరిణామం

ఏలూరు రూరల్, జూలై 24: అమరావతి, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి అండగా ఉంటామని కేంద్రబడ్జెట్‌లో పేర్కొనడం శుభపరిణామం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.విక్రమ్‌కిషోర్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో కూటమి నేతలతో కలసి బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం వెనుకబడిందన్నా రు. కూటమికి ప్రజలు ఇచ్చిన తీర్పును కేంద్రం గౌరవిస్తూ రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కేంద్రం నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. జనసేన ఏలూరు కన్వీనర్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అప్పులు తప్ప నిధులు సేకరణలో విఫలమయ్యారన్నారు. కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి ఊపిరిపోసిందన్నారు. బీజేపీ మహిళా నాయకురాలు నిర్మల కిషోర్ మాట్లాడుతూ మహిళలకు రుణసాయం పెంచడం మంచి పరిణామం అన్నారు. రెడ్డి నాగరాజు, నాగం శివ, కృష్ణప్రసాద్, మాలతిరాణి, శోభారాణి, దాన బాస్కర్‌రావు, గాది రాంబాబు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రంగా మారిస్తే ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజధానికి ఊపిరి పోశారని టీడీపీ జిల్లా అధి కార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్ అన్నారు. టీడీపీ పట్టణ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో సొంత ప్రయోజనాలకోసమే ఢిల్లీ వెళ్లారు గానీ రాష్ట్రానికి నిధులు తీసుకురావడంపై దృష్టి పెట్టలేదన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రం రావణ కాష్టంలా ఉంటే నేడు రామరాజ్యంలా ఉన్న రాష్ట్రంలో హింస పెరిగిపోతుందని, రాష్ట్రపతి పాలన కోరుతూ జగన్ ఢిల్లీలో నిరసన దీక్ష చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకులు తూతిగుంట రాము, సాయిల సత్యనారాయణ, చిట్రోజు తాతాజీ, పాతూరి అంబేధ్కర్, ఎస్.కె.యాకూబ్, బలుసు కిరణ్, నాయుడు శ్రీను, బాల బ్రహ్మం పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లోనే రూ. 15 వేల కోట్లు కేటాయించడంపై టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వర రావు, మున్సిపల్ కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు హర్షం వ్యక్తం చేశారు.

● చింతలపూడి: కేంద్రబడ్జెట్‌లో రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయడానికి కేంద్ర సహకారంపై టీడీపీ రైతు విభాగం నేత గుత్తా వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఐదేళ్ల తరువాత ఏపీ అభివృద్ధికి బాటలు పడడం, కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆది జగన్, కొత్తపూడి శేషగిరిరావు, టి.అప్పన్నదొర, జి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.15వేల కోట్లు కేటాయించినందుకు ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చి అందుకు తగ్గట్టుగా నిధులను కేటాయించడం హర్షణీయమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అధికారంలోకి వచ్చిన రెండునెలలు దాటకుండా రాష్ట్రానికి భారీగా నిధులు తీసుకొచ్చిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

అద్భుతమైన బడ్జెట్
అంబికా కృష్ణ



ఏలూరు, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతంగా ఉందని మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ అన్నారు. 'రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలకు భరోసా కల్పించడం ముదావహం. వృద్ధులు, మహిళలు, యువత సంక్షేమానికి పెద్దపీట వేశారు. పెట్టుబడులు పెరిగి పారిశ్రామికంగా, వ్యాపారపరంగా మరింత అభివృద్ధి చెందేందుకు ఇది దోహదం చేస్తుంది. ఇంత అద్భుతమైన బడ్జెట్ రూపకల్పన చేసిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు' అని తెలిపారు.

రైతు బజార్‌ను పరిశీలించిన జేసీ ధాత్రి రెడ్డి



రైతు బజార్‌కు వెళుతున్న జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు టూటౌన్, జూలై 24: పత్తేబాద రైతు బజారును జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి బుధవారం పరిశీలించారు. ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూరగాయల రేట్లు పెరుగుతున్న దృష్ట్యా తగ్గింపు ధరకు అమ్మే అవకాశాలను పరిశీలించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా రైతుబజార్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే బియ్యం, కందిపప్పు స్టాళ్లను పరిశీలించారు.

● ఏలూరు రూరల్: జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.ధాత్రి రెడ్డిని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు తదితరులు కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఏలూరు తాలూకా ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు కె.సత్యనారాయణ, ఎన్.శ్రీనివాస్, టి.శ్రీనివాస్, నరేంద్ర, నారాయణ, బేగ్, గంగాధర్, సునీత, భారతి, సత్యశ్రీ తదితరులు వారితో ఉన్నారు.

చేబ్రోలు అండర్‌పాస్ నిర్మాణకర్త బూరుగుపల్లి మృతి



ఉంగుటూరు, జూలై 24: చేబ్రోలు రైల్వే అండర్‌పాస్ నిర్మాణకర్త బూరుగుపల్లి ఆంజనేయులు (62) బుధవారం గుండెపోటుతో ఏలూరులో మృతిచెందారు. చేబ్రోలు రైల్వే గేటు వల్ల ద్విచక్రవాహనదారుల అవస్థలను గుర్తించి రెండేళ్ల క్రితం రూ. 4 లక్షలతో అండర్‌పాస్‌లో సిమెంట్ రోడ్డు నిర్మించారు. రైల్వేగేటు పడినప్పుడికీ అండర్‌పాస్ వల్ల ట్రాఫిక్ సమస్య కొంతమేర తీరింది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన సామాజిక సేవలో పెద్దఎత్తున పాల్గొనడంతో చుట్టుపక్కల ప్రజలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బూరుగుపల్లి మృతికి మానవత ప్రతినిధులు సంతాపం తెలిపారు.

వైసీపీకి ఏలూరు నగర అధ్యక్షుడు బొద్దాని రాజీనామా



ఏలూరు రూరల్, జూలై 24: ఏలూరులో వైసీపీకి షాక్ తగిలింది. 2009 నుంచి మాజీ మంత్రి ఆళ్ల నాని అనుచరుడిగా ఉంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న బొద్దాని శ్రీనివాస్ పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటన విడుదల చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశానని, పార్టీ కేంద్ర కార్యాలయానికి, అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి ఫ్యాక్స్ ద్వారా లేఖ పంపించినట్లు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను త్వరలో వెల్లడిస్తానని ఆయన లేఖలో వివరించారు. వైసీపీ ఏలూరు నగర కార్యదర్శి మంచెం మైబాబు కూడా పదవికి రాజీనామా చేశారు.

గ్రంథాలయ పితామహుడు వెంకట రమణయ్య

ఏలూరు టూటౌన్, జూలై 24: రాష్ట్ర గ్రంథాలయ ఉద్యమకారుడు, పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి కార్యక్రమాలు జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహించారు. వెంకట రమణయ్య చిత్రపటానికి గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటి లైబ్రేరియన్ నారాయణ రావు మాట్లాడుతూ 1911లో విజయవాడలో రామమోహన గ్రంథాలయ స్థాపనకు వెంకటరమణయ్య కృషి చేశారన్నారు. 1914లో విజయవాడలో గ్రంథాలయ మహాసభలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాశరథి, జాషువా రచనలు మరువలేనివి

చింతలపూడి, జూలై 24: దాశరథి గుర్రం జాషువా రచనలు మరువలేనివని అరసం నాయకులు బి.ఎన్ సాగర్ అన్నారు. చింతలపూడిలో దాశరథి శత జయంతి ఉత్సవం, జాషువా వర్ధంతిని పురస్కరించుకుని సాహితీ సమాలోచన కార్యక్రమం నిర్వహించారు. వారి రచనలను పలువురు కవులు వివరించారు. మల్లెల జయరాజు మాట్లాడుతూ జాషువా కృషి, ప్రాధాన్యత జీవితం గురించి వివరించారు. సూర్యకుమార్, దాశరథి కవిత్వం విశిష్ట గురించి వివరించారు. కార్యక్రమంలో అశోక్, థామస్, కె.గురవయ్య, రాహుల్, జోషి, పాండురంగారావు తదితరులు పాల్గొని మాట్లాడారు.



ఏలూరులో పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు



కొత్తపల్లి పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

ఏలూరు రూరల్, జూలై 24: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రకాష్ అన్నారు. శిక్షాసప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. హెచ్ఎం ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఉన్నత స్థానాలకు చేరిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీడీ పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో-2 దేవినేని వెంకటరమణ తెలిపారు. పెదపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామీణ క్రీడలైన ఏడుపెంకులు, కర్రా బిళ్ల, ఒప్పులకుప్ప నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ ఎం జేవీఆర్.మరియరాజు అన్నారు. పాఠశాల విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ నెల 28 వరకు పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు అన్ని రకాల సౌకర్యాలు సమకూరుస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రెడ్‌క్రాస్ నిత్యావసరాలు



సరుకులు అందిస్తున్న ఆర్డీవో, రెడ్‌క్రాస్ సభ్యులు

వేలేరుపాడు, జూలై 24: మండలంలోని తూర్పుమెట్ట గ్రామంలో వరద బాధితులకు రెడ్‌క్రాస్ సంస్థ నిత్యావసర సరుకులను అందజేసింది. ఆర్డీవో అద్దయ్య, తహసీల్దార్ జీ.చెన్నారావు, రెడ్‌క్రాస్ సభ్యులతో బుధవారం గ్రామానికి పడవపై వెళ్లి నిత్యావసర సరుకులను గ్రామస్థులకు అందించారు. సీఐ శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీహరి, ఇతరాధికారులు పాల్గొన్నారు.

గొర్రెల మందు పంపిణీ

బౌఅండ్‌యారో స్వచ్ఛంద సంస్థ అందజేసిన గొర్రెలు, మేకల మందులను జీలుగుమిల్లి ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ సాయి బుచ్చారావు ఆధ్వర్యంలో బుధవారం అందించారు. రేపాకగొమ్ము, శివకాశిపురం గ్రామాల పెంపకం దారులకు సుమారు 200 మేకలకు, గొర్రెలకు సరిపడ మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో గొర్రెలకు, మేకలకు అనేక రకాల వ్యాధులు వస్తుంటాయన్నారు. వరదల వలన పశువులకు ప్రమాదం జరిగితే సహాయం అందించడానికి పశు వైద్య సిబ్బంది, బౌఅండ్‌యారో స్వచ్ఛంద సంస్థ అందుబాటులో ఉంటాయన్నారు. సంస్థ సీఈఓ మణికంఠ, క్రాంతికుమార్, రఘు, శ్రీను, ఎల్ఎస్ఏ.రాజు, కేవీఓ సత్యనారాయణ, రవితేజ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో సహాయ కార్యక్రమాలు

కుక్కునూరు, వేలేరుపాడు: అల్లూరినగర్ గ్రామానికిచెందిన వరద బాధితులకు బీజేపీ నాయకులు వాడపల్లి లక్ష్మణాచార్యులు 2 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేశారు. జీలుగుమిల్లి బీజేపీ నాయకులు ప్రసాద్ ఆధ్వర్యంలో బాధితులకు కూరగాయలు, నూనెప్యాకేట్లు అందజేశారు. కృష్ణార్జునరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. లచ్చిగూడెం, కొమ్ముగూడెం, కౌండిన్య ముక్తి వరద బాధితులు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందారు. దాదాపు 428 కుటుంబాలకు కూరగాయలు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. తహసీల్దార్ అచ్యుతకుమారి పునరావాస కాలనీలను పర్యవేక్షించారు.

చిగురుమామిడి గ్రామానికి విద్యుత్ పునరుద్ధరణ

వేలేరుపాడు, కుక్కునూరు, జూలై 24: చిగురుమామిడి గ్రామాన్ని వరద చుట్టుముట్టడంతో వారం రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో సిబ్బంది వరదనీటిలో విద్యుత్ స్తంభాల వద్దకు పడవలో వెళ్ళి మరమ్మతు చేశారు. అనంతరం గ్రామానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్ సిబ్బందికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కోడివ్యర్థాలను వాహనాలు పట్టివేత

పెదపాడు, జూలై 24: చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. రెవెన్యూ మత్స్యశాఖ సిబ్బందితో పెదపాడు, పరిసర గ్రామాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి కోళ్లవ్యర్థాల రవాణాపై నిఘా ఉంచామన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లోని కోడివ్యర్థాలను పూడ్చిపెట్టి, వాహన యజమానులు, చెరువు యజమానులతో పాటుగా డ్రైవర్లపై కేసు నమోదు చేసి పెదపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

చింతలపూడి, జూలై 24: బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని వాటిని ప్రోత్సహించవద్దని ఐసీడీఎస్ పీవో టి.మాధవి అన్నారు. ప్రగడవరం పంచాయతీ ఫాతిమాపురంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలిక విద్య అవసరమని, లింగ నిర్ధారణ పరీక్షలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యాచారాలు, హింస, దాడులపై రక్షణ చర్యలు వివరించారు. సూపర్‌వైజర్లు కమలాబాయమ్మ, సరోజిని, కవిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** ఆధార్ అప్డేట్‌కు ఈ నెల 27 వరకు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ తెలిపారు. సచివాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు.
- ఎముకల సాంద్రత నిర్ధారణ పరీక్షా శిబిరం ఈ నెల 27న రంగూన్ మేడరోడ్డులో డాక్టర్ పంకజ్ హోమియో క్లినిక్‌లో నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు గీతాపంకజ్ తెలిపారు.
- సెంట్‌థెరిస్సా మహిళా కళాశాలలో క్రీస్తు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన హెప్సిబా, అరుణ కుమారిని సన్మానించి వారి సేవలు కొనియాడారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, నిర్మల జ్యోత్స్న, కె.శ్రీలత, ఎం.సరస్వతి, దీప్తి, అనూష, ఎస్.మాధురిరోస్, షాహిలానీషాద్, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ మరియా క్రిస్టియా పాల్గొన్నారు.
- **చింతలపూడి :** సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని రాఘవాపురం పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్‌చైతన్య అన్నారు. డెంగీ నివారణపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.
- **నిడమర్రు :** సిద్ధాపురం పాఠశాల విద్యార్థులకు రూ. 10వేల విలువైన నోటుపుస్తకాలు, విద్యా సామగ్రి దాత ఆదిరెడ్డి చంద్రరావు అందజేశారు. సర్పంచ్ ఆదిరెడ్డి సత్యవతి, ఎంఈవో కె.రాంబాబు, హెచ్ఎం కె.రవిప్రకాష్, ఉపసర్పంచ్ నౌడు రాంబాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** మండలంలోని కైకరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కిట్లును పంపిణీ చేశారు. సర్పంచ్ సలగాల గోపి, చిన్ను సత్యవాణి, హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.
- **బుట్టాయగూడెం :** ఏజెన్సీ ప్రాంతంలో భారీవర్షాలకు ధ్వంసమైన రోడ్లను బాగుచేయాలని ముంజులూరు సర్పంచ్ కెచ్చెల ముక్కారెడ్డి ఆధ్వర్యంలో కొండరెడ్లు ఐటీడీఏ అధికారులకు వినతిపత్రం అందజేశారు.
- **భీమడోలు :** నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకటేశ్వరరావు మృతికి మండల పరిషత్ అధికారులు నివాళులర్పించారు. ఎంపీడీవో స్వర్ణలత ఆధ్వర్యంలో సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది మృతి చెందిన ఎంపీడీవో ఫ్లెక్సీ వద్ద మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.
- **ద్వారకాతిరుమల :** మంత్రి గుమ్మడి సంధ్యారాణిని తిమ్మాపురానికి చెందిన టీడీపీ నేత కొత్తపల్లి సుబ్బారావు అమరావతి సచివాలయంలో కలసి చినవెంకన్న శేషవస్త్రాన్ని, ప్రసాదాలను అందజేశారు.



పంట పొలాల పరిశీలనలో భాగంగా చేల బురద గట్టుపై నడిచి వెళుతున్న వైఎస్ షర్మిల

జగన్ పాలనలో జలయజ్ఞానికి సమాధి

ఎర్ర కాలువ ముంపు ప్రాంతాల్లో వైఎస్ షర్మిల పరిశీలన

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 24 : జగన్ పాలనలో వైఎస్ మానస పుత్రికగా రైతుల కోసం ప్రారంభించిన జలయజ్ఞం కార్యక్రమాన్ని సమాధి కట్టారని, కనీసం పాత మంచినీటి ప్రాజెక్టులకు మరమ్మ తులు కూడా చేయకపోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఎర్ర కాలువ ముంపు ప్రభావంతో నీటమునిగిన తాడేపల్లి గూడెం మండలం నందమూరు ప్రాంతంలో బుధవారం ఆమె పంట చేల వద్దకు బురదలో నడిచి వెళ్లారు. రైతులు ఆమెకు కుళ్లిన వరినారు చూపించేందుకు చేలో దిగితే ఆమె స్వయంగా నడుంలోతు నీళ్లలో దిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెతో గ్రామంలోని రైతులు ముంగళ్ల రత్తయ్య, గర్సుకూటి సర్వేశ్వరరావు తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఎప్పుడు వర్షాలు వచ్చినా తమ ప్రాంతాన్ని ఎర్ర కాలువ ముంచేస్తుందని గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఎర్రకాలువ గట్లు పటిష్టం చేసినా గట్లకు గండ్లు పడ్డాయని. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎర్రకాలువ వైపు కన్నెత్తి చూడకపోవడంతోనే గత ఐదేళ్లుగా తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఎకరాకు రూ.12 వేల చొప్పున ఒక్కో రైతుకు లక్ష నుంచి మూడు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుల మాటలకు స్పందిస్తూ ఆమె గత వైసీపీ ప్రభుత్వం పాపాలే నేడు ప్రతిపక్షం కూడా లేకుండా చేశాయన్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వమైనా వచ్చే ఏడాది నాటికి రైతులకు ఈ పరిస్థితి రాకుండా ముంపు భారి నుంచి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కష్టాల్లో ఉన్న రైతులకు నష్టపరిహారం అందించాలని, రైతుల కోసం ప్రభుత్వం ప్రకటించకపోయినా రుణమాఫీ చేయాలని డిమాం డ్ చేశారు. ముంపు ప్రాంతంలో రాజకీయాలు చేయడానికి రాలేదని రైతుల పరిస్థితి స్వయంగా చూసి ప్రభుత్వానికి తెలియచెప్పేందుకే చేలలోకి వెళ్లి పరిస్థితి సమీక్షిస్తున్నామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మార్నీడి బాబ్జి, జిల్లా అధ్యక్షురాలు అరిగిల అరుణ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్, కామన ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

జగన్ తీరు.. దున్నపోతు మీద వర్షం కురిసినట్లే..

అసెంబ్లీలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని



కైకలూరు జూలై 24 : ప్రభుత్వం ఏర్పడిన 45 రోజులకే రాష్ట్రపతి పాలనంటూ ధర్నాకు దిగడం దున్నపోతు మీద వర్షం కురిసినట్లుందని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అసెంబ్లీలో జగన్‌పై ధ్వజమెత్తారు గతంలో అధికారంలో ఉన్న సమయంలో రాజ్యాంగానికి వ్యతిరేకంగా 200లకు పైగా కేసులు వేశారని ఇది కూడా అలాగే వీగిపో తుందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో 151 మంది ఎమ్మెల్యేలకు ఇప్పుడు 11 మందే ఉన్నారని, మిగిలిన 140 మందిని ఇప్పించమని కోర్టులో కేసు వేసినా ఆశ్చర్యపోనవసరం లేదని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష హోదా కావాలంటూ కోర్టులో కేసు వేయడం జగన్ మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేయాలి

నూజివీడు టౌన్, జూలై 24:మండలంలోని వివిధ గ్రామాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశామని ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. 25న తూర్పుదిగవల్లి, ముక్కొల్లుపాడు, పోతురెడ్డిపల్లి, గొల్లపల్లి, 26న సిద్ధార్థనగర్, మీర్జాపురం, మర్రిబంధం, వెంకటాయపాలెం, 27న తుక్కులూరు, జంగంగూడెం, ఎంఎన్ పాలెం, సీతారామపురం, పల్లెర్లమూడి గ్రామాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

కౌలు కార్డుతో పలు ప్రయోజనాలు



రైతులకు కౌలు కార్డులు అందజేస్తున్న ఏడీఏ

ముదినేపల్లి, జూలై 24 : కౌలు రైతులు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ ప్రయోజనాలు పొందేందుకు కౌలు కార్డులు పొందటం తప్పనిసరని మండవల్లి డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి తెలిపారు. పూటుకూరు, వణుదుర్రు, వాడవల్లి గ్రామాల్లో బుధవారం ఏవో వేణుమాధవ్ ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కౌలు రైతులందరూ కౌలు కార్డులు పొందాలని సూచించారు. సబ్సిడీపై యంత్ర పరికరాలు, పంట నమోదు, బ్యాంక్ రుణాలు, ధాన్యం కొనుగోలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్ట పరిహారం పొందేందుకు ఇతర సబ్సిడీలు వినియోగించుకునేందుకు కౌలు కార్డులు అవసరమని తెలిపారు. వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న జాన్సీ

ముదినేపల్లి, జూలై 24 : స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పెయ్యేరు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జాన్సీ మాట్లా డుతూ పరిసరాల పరిశుభ్రతతోనే డయేరియాను నిరోధించవచ్చునని తెలిపారు. దోమల వ్యాప్తిని అరికట్టాల్సి అవసరం ఉందన్నారు. ఇందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ బి.పద్మ పాల్గొన్నారు.

పాఠశాలలకు యూనిఫాం, బూట్లు సరఫరా



కలిదిండి, జూలై 24 : ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాం, బూట్లు అందజేస్తున్నామని ఎంఈవో ప్రభాకర్‌బాబు బుధవారం తెలిపారు. గతం లో హెచ్‌ఎంలు యూనిఫాం, షూస్ ఎంఈవో కార్యాలయం నుంచి తీసుకెళ్లే వారన్నారు. ప్రభుత్వ నూతన విధానంలో వాహనం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాం, షూస్ అందజేస్తున్నామన్నారు. ఈ నూతన విధానం వలన హెచ్‌ఎంలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు.

తమ్మిలేరుకు జల కళ

▸ నీటితో నిండిన జలాశయం ▸ ఆయకట్టు రైతుల్లో ఆనందోత్సాహాలు



తమ్మిలేరు ప్రాజెక్టు గోనెలవాగు బేసిన్‌లో నిండుగా నీరు

చాట్రాయి, జూలై 24: ఏలూరు జిల్లాలో 25 వేల ఎకరాల మెట్ట భూములను సస్యశ్యామలం చేసే తమ్మిలేరు ప్రాజెక్టు నీటితో నిండి కనువిందు చేస్తుంది. జలాశయం నీటితో నిండడంతో ఆయకట్టు రైతులు ఆనందోత్సవాలు వ్యక్తం చేస్తున్నారు. చుట్టు పక్కల మండలాల నుంచి రైతులు, ప్రజలు వచ్చి తమ్మిలేరు ప్రాజెక్టు వద్దకు వచ్చి నీటి అందాలను తిలకిస్తున్నారు. కొన్నేళ్ళ నుంచి ప్రాజెక్టుకు ఇంత భారీ వరద రాలేదని స్థానికులు అంటున్నారు. ఏలూరు పట్టణానికి వరద ముంపు నివారణ, మెట్ట ప్రాంతానికి తాగు, సాగు నీరు అందించాలనే లక్ష్యంతో, ఈ ప్రాజెక్టుకు ప్రపంచ ప్రఖ్యాత ఇంజినీరు డాక్టర్ కేఎల్ రావు డిజైన్ చేశారు. 1962లో అప్పటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, మూడు వేల ఎకరాల విస్తీర్ణంలో, ఏడు కిలోమీటర్ల మట్టి కట్టతో ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. అనేక అడ్డంకుల అధిగమించి 1978కి ప్రాజెక్టు ఉపయోగంలోకి వచ్చింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగాక కరువు ప్రాంతంలో సిరులు కురిసాయి. ప్రజల ఆర్థిక పరిస్థితిలో కూడా గణనీయమైన అభివృద్ధి జరిగిందని చెప్పవచ్చు.

ప్రాజెక్టు నుంచి నీరు విడుదల



తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరు విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

చాట్రాయి, జూలై 24: మంకొల్లు పరిధిలో ఉన్న తమ్మిలేరు ప్రాజెక్టు మధ్య తూముకు బుధవారం మండల టీడీపీ నాయకుడు బొట్టు లక్ష్మణరావు, రైతులు పూజలు చేసి ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసి కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు ఆధునికీకరణకు 2018లో టీడీపీ ప్రభుత్వం జపాన్ బ్యాంకు నిధులు రూ.18 కోట్లు మంజూరు చేయగా, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు అరకొర పనులతో కాలక్షేపం చేసిందన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి దీనిపై అధికారులతో మాట్లాడారని, వర్షాలు తగ్గిన తరువాత పనులు పునఃప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయని లక్ష్మణరావు తెలిపారు. టీడీపీ నాయకులు చిట్టిబొమ్మల గంగాధరరావు, బొలినేని మధు రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకే జగన్ ధర్నా నాటకం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న త్రినాథరాజు

కైకలూరు జూలై 24 : రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులో భారీగా నిధులు రావడం సీఎం చంద్రబాబు చాణక్యతకు నిదర్శనమని మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు అన్నారు. కైకలూరులో టీడీపీ నాయకులు బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. కేంద్రం రాష్ట్రంపై వరాలజల్లు కురిపించిందని దీంతో రాజధాని అమరావతి, పోలవరం పనులు కల సాకారం అవుతాయన్నారు అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడమే గాక పూర్తియ్యేవరకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని వాటిని అడ్డుకునేందుకే మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఢిల్లీలో ధర్నాకు తెర తీశారన్నారు. జాతీయ మీడియా ద్వారా దుష్ప్రచారం చేసి రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవాలని జగన్ ఈ చర్యకు పాల్పడ్డారన్నారు. ఐదేళ్లలో ఎంపీల మద్దతు ఉన్నప్పటికీ రాష్ట్రానికి నిధులు తీసుకు రాకుండా తన కేసులు, స్వప్రయోజనాల కోసమే ఢిల్లీ చుట్టూ తిరిగారని విమర్శించారు. మద్యం పాలసీపై సీబీడీ ద్వారా విచారణ చేసి మరిన్ని దుర్మార్గాలను బయటకు తీస్తారన్నారు. కొంతమంది కార్యకర్తలు గత పాలకులపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆందోళన చెందుతున్నారని తప్పు చేసిన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం శిక్ష వేస్తుందన్నారు. రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎండీ జానీ, జిల్లా పార్టీ నాయకులు పోలవరపు లక్ష్మీరాణి, కేకే బాబు, పార్టీ నేతలు వేములపల్లి కారుణ్య, బంకపల్లి భాస్కరరావు, వీరాబత్తిన సుధా, వానిపల్లి సతీష్‌కన్నా, సయ్యద్ బాషీద్, బాజానీ, డోకల శ్రీనివాసరావు, లక్కింశెట్టి మోహన్, ఈదా వెంకటస్వామి, పడమటి వాసు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో అవస్థలు

నూజివీడు టౌన్, జూలై 24: పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సుదూర ప్రాంతాల ఫీడర్ల పుణ్యమా అని వరుస వర్షాల నేపథ్యంలో ఎదురయ్యే అవాంతరాలకు తోడు అదనంగా అప్రకటిత విద్యుత్ కోతలతో ఎప్పుడు కరెంట్ ఉంటుందో, ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి నెలకొంది. నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీ సబ్‌స్టేషన్ పరిధిలో అత్యధికంగా విద్యుత్ కోతలు ఉండటంతో సబ్ స్టేషన్ కింద ఉన్న ఏరియా ఆసుపత్రికి సైతం విద్యుత్ సరఫరా నిలిచిపోయి రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో గంట నుంచి గంటన్నర విద్యుత్ కోతలు ఉంటుండగా, పది రోజుల నుంచి కోతలు మరింత పెరిగాయి. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయంలో ప్రజాప్రతినిధుల చిత్రపటాలు



లోపూడి సచివాలయంలో ప్రజాప్రతినిధుల చిత్రపటాలతో టీడీపీ నాయకులు, అధికారులు

ముసునూరు, జూలై 24: లోపూడి సచివాలయంలో స్థానిక టీడీపీ నేత చలమాల గంగధరరావు అందజేసిన సీఎం నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చిత్రపటాలను టీడీపీ నాయకులు బుధవారం ఏర్పాటు చేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు వేంపాటి శ్రీనివాసరావు, నాయకులు చలమాల వెంకటేశ్వరరావు, పంజుగల వెంకయ్య, చలమాల మల్లేశ్వరరావు, లక్కపాము కాంతరావు, పి.శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు యశోదకృష్ణ, భాను తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదతో ప్రజలు బెంబేలు



నూజివీడు పట్టణంలో సంచరిస్తున్న కుక్కలు

నూజివీడు టౌన్, జూలై 20: గ్రామ సింహాల తాకిడితో పట్టణ వాసులు భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా నూజివీడు ఎంప్లాయిస్ కాలనీ, అంబర్‌పేట, బంగినపల్లితోట తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో గ్రామ సింహాలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ పాఠశాల వెళ్లే చిన్నారులను వెంబడిస్తుండటంతో వారు భయంతో పరుగులు తీస్తున్నారు. అలాగే ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి వెంట పడుతుండటంతో వాహనాలు అదుపు తప్పి పడిపోయి తీవ్ర గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. ప్రధాన కూడళ్లల్లో సైతం కుక్కలు దాడి చేస్తుండటంతో వాటిని నియంత్రించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

● ఆగిరిపలి : గ్రామంలో వీధికుక్కల బెడద రోజురోజుకి తీవ్రమవుతోంది. గత కొద్ది కాలంగా ఆగిరిపల్లిలో కుక్కకాటుకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నప్పటికీ కుక్కల నియంత్రణలో అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పిల్లలు స్కూల్‌కు వెళ్లి వచ్చే సమయంలో ఈ కుక్కలు నుంచి తమ పిల్లలను ఎలా రక్షించుకోవాలో తెలియక తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీధులలో వెళ్ళే పాదచారులను సైతం వీధికుక్కలు వదలటం లేదు. అధికారులు శ్రద్ధవహించి ఇకనైనా కుక్కల బెడద నుంచిప్రజలను రక్షించాలని గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

క్రైం సమాచారం

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మండవల్లి జూలై 24 :ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండవల్లి రైల్వేస్టేషన్ వద్ద బుధవారం తెల్లవారుజాము చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే సిబ్బంది అజయ్ కుమార్ రైల్వేట్రాక్‌పై మంగళవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సుమారు 2.45 గంటల సమయంలో మండవల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది రైల్వేట్రాక్ పై పడి ఉండడాన్ని గమనించాడు. వెంటనే రైల్వేస్టేషన్ మాస్టర్‌కు, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సైలు బి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

అయ్యంకి వెంకట రమణయ్యకి ఘన నివాళి



కలిదిండిలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ మిత్రులు

ముదినేపల్లి, జూలై 24 : ముదినేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు స్వర్గీయ అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో అ య్యంకి చిత్రపటానికి విద్యా ర్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయోద్యమానికి ఆయన అందించిన సేవలను శ్రీదేవి తెలిపారు.

● కలిదిండి : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య గ్రంథాలయాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన అయ్యంకి వెంకట రమణయ్య చిరస్మరణీయుడని కొనియాడారు. సాహితీ మిత్రులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లంక గ్రామాలకు రాని బస్సులు

రోడ్లు ఛిద్రమవ్వడంతో నిలిపివేసిన ఆర్టీసీ అధికారులు



కలిదిండి, జూలై 23 : మండలంలోని లంక గ్రా మాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రజలు కోరు తున్నారు. లంక గ్రామాల ప్రధాన రహదారి పెద్ద గుంతలు పడి అధ్వానం గా ఉండటంతో బస్సులను నిలుపుదల చేశారు. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో కూటమి నాయకులు, రైతులు స్వచ్ఛందంగా లంక గ్రామాల ప్రధాన రహదారికి 15 కిలోమీటర్ల మరమ్మతులు చేయించారు. గోతుల్లో కంకర వేసి పూడ్చి చదును చేశారు. భీమవరం, గుడివాడ, విజయ వాడ, ఏలూరు నుంచి ఆర్టీసీ బస్సులు గతంలో ప్రతిరోజు లంక గ్రామాలకు రాకపోకలు సాగించేవి. రహదారికి మరమ్మతులు చేసినప్పటికీ విజయవాడ డిపోకి చెందిన పల్లె వెలుగు బస్సు 10 రోజులుగా రావటం లేదని ప్రయాణి కులు వాపోతున్నారు. బస్సుల లేకపోవడంతో ఆటోలకు డిమాండ్ పెరిగి అధిక ధరలు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి లంక గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై విజయవాడ డిపో మేనేజర్‌ను వివరణ కోరగా, లంక గ్రామాల రహదారి మరమ్మతులు చేసిన విషయం తనకు తెలియదన్నారు. ఆర్టీసీ సర్వీసుల నడిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రైనేజీలలో పూడికతీత

ముసునూరు, జూలై 24: అక్కిరెడ్డిగూడెంలో ప్రధాన రహ దారికి ఇరువైపుల డ్రైనేజీల పూడిక తీత పనులను బుధవారం చేపట్టా రు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెంద కుండా మురుగు నీటి నిల్వలను తొలిగించి, బ్లీసింగ్ చల్లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారయణ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించడంతో మౌలిక సదుపాయాలను కూడా కల్పించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పంచాయతీలో ప్రస్తుతం నిధులు లేకున్న గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆమె వివరించారు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు పూర్వవైభవం వస్తుందని సర్పంచ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



ఆటల పోటీలలో పాల్గొన్న విద్యార్థినులు

ముదినేపల్లి, జూలై 24 : శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు ముదినేపల్లి మండలంలో బుధవారం కోలాహలంగా జరిగాయి. విద్యాశాఖ నిర్దేశించిన ప్రకారం మండలంలోని పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈవో కె.నరేష్‌కుమార్ పర్యవేక్షణలో వాడవల్లి, దేవపూడి, వైవాక, కాకరవాడ, చేవూరు తదితర పాఠశాలల్లో విద్యార్థులకు చెస్, క్యారమ్స్, పరుగు పందాలు తదితర ఆటల పోటీలను ప్రధానోపాధ్యాయులు నిర్వహించారు.

పాల రైతు కుటుంబానికి రూ.50 వేలు అందజేత



పాలరైతు భార్యకు చెక్కు అందజేస్తున్న సాంబమూర్తి

చాట్రాయి, జూలై 24: కోటపాడు పాల సహకార సంఘానికి పాలు పోస్తున్న రైతు చెలికాని భాస్కర రావు ఇటీవల మృతి చెందగా, కృష్ణా మిల్క్ యూనియన్ క్షీర బంధు పథకం కింద రూ.50 వేల చెక్కును బుధవారం మృతుడి భార్యా ఉషారాణికి క్లస్టర్ మేనేజర్ సాంబశివ మూర్తి, సంఘం అధ్యక్షుడు సోమవరపు శ్రీనివాసరావు అందజేశారు. పాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి పక్కనే ప్రమాదకరమైన అగాధం



తమ్మిలేరు బ్రిడ్జి పక్కనే ఉన్న ప్రమాదకరమైన అగాథం(సర్కిల్‌లో)

చాట్రాయి, జూలై 24: టీఆర్పీ రెగ్యులేటర్ వద్ద, మంకొల్లు గ్రామ పరిధిలో తమ్మిలేరు బ్రిడ్జి పక్కన ప్రమాదకరమైన అగాథం ఏర్పడింది. భారీ వర్షాలకు రహదారి సైడ్‌బరమ్ కోతకు గురికావటంతో అగాథం ఏర్పడింది. అగాథం ఉన్న స్థలంలో గడ్డి పిచ్చిమొక్కలు ఉండటంతో అటుగా వచ్చే వాహనచోదకులకు కనిపించే అవకాశం లేదు. ఇక్కడ ఏదైనా వాహనం ఎదురువచ్చి పక్కకు తప్పుకుంటే అంతే సంగతులు. 30 అడుగల లోతులోకి పడిపోయే ప్రమాదం ఉంది. వెంటనే అధికారులు స్పందించి అగాథం పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

తమ్మిలేరు బ్రిడ్జి పక్కన పడిన అగాథం పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. త్వరలోనే అవసరమైన పనులు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాము

- బాబూరావు డీఈఈ, ఆర్అండ్‌బీ శాఖ, నూజివీడు

పాఠశాలలకు నాణ్యమైన బియ్యం ఇవ్వండి



ముదినేపల్లిలో మాట్లాడుతున్న నాగమణి

ముదినేపల్లి, జూలై 24 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు లో ఏజెన్సీ నిర్వాహకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరించాలని పథకం కార్మికుల అసోసియేషన్ సీఐటీయూ విభాగం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి డిమాండ్ చేశారు. ముదినేపల్లిలో బుధవారం మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. అనంతరం నాగమణి విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న బియ్యంలో నాణ్యత లోపించిందని చెబుతూ కొత్త ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని కోరారు. వంట ఏజెన్సీల కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, బీమా సదుపాయం వర్తింప చేయాలని ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని నాగమణి డిమాండ్ చేశారు. మండల మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు దాసరి కృష్ణవేణి, కార్యదర్శి అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్



మండవల్లి జూలై 24 : కాపు సంక్షేమ సేవా సంఘం కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా ముదినేపల్లి మండల చిగురుకోటకు చెందిన వర్రే హనుమాన్ ప్రసాద్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు పూజారి నిరంజన్ ప్రతిపాదన మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీరాములు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాద్ మండవల్లిలో స్థిరపడినప్పటికీ, చిగురుకోట ఆంజనేయస్వామి ఆలయ పాలక మండలి కార్యదర్శిగా ఉన్నారు. జనసేన పార్టీలో క్రియాశీలకంగా గుర్తింపు పొందారు. ప్రసాద్ బుధవారం మండవల్లిలో మాట్లాడుతూ కాపు సామాజిక వర్గాన్ని రాజకీయాలకు, వివాదాలకు తావు లేకుండా అందర్నీ ఒక తాటిపై తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాపు సామాజిక వర్గంతో పాటు మిగిలిన అన్ని వర్గాలతో కలిసి ఉండే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పులి శ్రీరాములు మాట్లాడుతూ సంస్థ సిద్ధాంతాల ప్రకారం కాపుల ఐక్యతకు కృషి చేయాలని, రాజ్యాధికార సాధన కోసం అన్ని సామాజిక వర్గాల ప్రజలతో సత్సంబంధాలతో మెలగాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్ వితరణ



ఫ్యాన్‌ను అందజేస్తున్న టీడీపీ

ముసునూరు, జూలై 24: వేల్పుచర్ల పడమర ఏస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి టీడీపీ నాయకులు గరికిముక్కు నాని సీలింగ్ ఫ్యాన్‌ను బుధవారం అందజేశారు. ఈ కేంద్రంలో ఉన్న ఫ్యాన్ కొన్నేళ్ళ క్రితం పూర్తిగా కాలిపోయింది. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. సీలింగ్ ఫ్యాన్‌ను నాని అంగన్‌వాడీ కార్యకర్త ఎస్తేరుకు అందజేసి, అమర్చారు. టీడీపీ నాయకులు దేవేంద్ర, లక్ష్మణ్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై చిన్నచూపు



ఆర్.లక్ష్మణరావు

ముసునూరు, జూలై 24: 2024-25 కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని చిన్నచూపు చూశారని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యాదర్శి రాయంకుల లక్ష్మణరావు బుధవారం విమర్శించారు. ఎరువులపై వేటు వేశారన్నారు. గత బడ్జెట్ కంటే రూ.24,894 కోట్లు ఎరువులపై సబ్సిడీ తగ్గించారన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార భద్రత అవసరమని, ఎరువులపై రూ.రెండు లక్షల కోట్ల సబ్సిడీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 50 ఏళ్ల నిండిన ప్రతి రైతుకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు.

బాలికలకు అండగా మిషన్ శక్తి



మిషన్ శక్తి పై అవగాహన కల్పిస్తున్న లావణ్య

కైకలూరు జూలై 24 : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఆడపిల్లకు 18 ఏళ్ల నిండకుంటా పెళ్లి చేస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.లావణ్య అన్నారు. కైకలూరు వెలంపేట ఎంపీయూపీ స్కూల్లో బుధవారం మిషన్ శక్తి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరు నుంచి ఎనిమిదో తరగతి బాలికలకు మిషన్ శక్తి పథకంపై బాల్య వివాహాలు, బాలికల హక్కుల, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దానం ప్రసాద్, అంగన్వాడీ టీచర్లు ఎల్ మీనాకుమారి, సుగుణ, గౌరి, కవిత, తదితరులు పాల్గొన్నారు.